https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 7 | సంచిక 243 | కర్నూలు | గురువారం, 18 జనవరి 2024 | పేజీలు 9 | వెల రూ. 5.00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad





# తిరుగు ప్రయాణంలో ప్రజలు



## సొంతూళ్ల నుంచి మళ్లీ నగరం వైపు విజయవాడ హైవేపై పెరిగిన రద్దీ



విజయవాడ, జనవరి17(శ్రీచక్ర) : సంక్రాంతి పండుగకు వెళ్లిన జనం.. మళ్లీ పట్నం బాట పట్టారు. దీంతో రోడ్లపై వాహనాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే పొగమంచు కారణంగా వాహనాల కదలికలో ఇబ్బందులు వచ్చాయి. పొగమంచు కారణంగా రోడ్లపై ముందుదారి కనిపించక ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో విజయవాడ రహదారిపై పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. సెలవులకు, పండుగకు సొంతూళ్లకు వెళ్లి, తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుండడంతో విజయవాడ హైవే బిజీగా మారింది. దీంతో గత 2,3 రోజుల నుంచీ బోసిపోయిన హైదరాబాద్ రోడ్లు.. మళ్లీ జనసంద్రంగా మారాయి. సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో జనం పల్లెల నుంచి పట్నం బాట పట్టారు. సొంతూళ్ల నుంచి హైదరాబాద్ కు ప్రయాణం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ భారీగా పెరిగి పోయింది. రద్దీ దృష్ట్యా పంతంగి టోల్ ప్లాజా, కొర్లపాడు టోల్ ప్లాజాల వద్ద అదనపు టోల్ చెల్లింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు సాధారణం కంటే హైవేపై రెట్టింపు వాహనాలు ప్రయాణిస్తున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇక అటు సొంతూళ్ల నుంచి.. హైదరాబాద్ కు వచ్చే వారి కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

# ఎన్నికల సన్నద్ధతలో.. వైసీపీ అధినేత జగన్



- విపక్షాలకన్నా ముందుగానే శంఖారావం
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అనుచరగణం

2

# అయోధ్య నుంచి బాబుకు ఆహ్వానం

**అమరావతి, జనవరి17(శ్రీచక్ర):**




అయోధ్య రామాలయంలో శ్రీరామ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి రావాల్సిందిగా ఇప్పటికే అనేక మంది ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి. ఇందులో రాజకీయ, సామాజిక, వివిధ రంగాల ప్రముఖులు ఉన్నారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కూడా అయోధ్యకు రావాలని ఆహ్వానం వచ్చింది. ఈనెల 22న అయోధ్య రామజన్మభూమి దేవాలయంలో ప్రాణప్రతిష్ట వేడుక జరుగనుంది. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా చంద్రబాబుకు శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు ఆహ్వానం పంపారు. మరోవైపు అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 16 నుంచి ప్రారంభమయ్యాయి. 16 నుంచి 21 వరకు ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి. జనవరి 18న ఆలయ గర్భగుడిలో రామ్‌లల్లా విగ్రహాన్ని ఉంచనున్నారు. 22వ తేదీ మధ్నాహ్నం 12:20 గంటలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మొదలుకానుంది. మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగనుంది.

# రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్

- అటుసినిమా రంగం..ఇటు రాజకీయరంగం
- అన్నగా ప్రజల గుండెల్లో చిరస్థానం

**విజయవాడ, జనవరి17(శ్రీచక్ర):**



తెలుగు రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన మహానటుడు, ఆధునిక సామాజికవేత్త నందమూరి తారకరాముడు. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడిగా చరిత్ర కెక్కారు. ఆయన రాజకీయాల్లోకి రాకముందు స్తబ్దుగా ఉన్న రాజకీయరంగంలో కొత్త తరం ఉద్భవించింది. కొత్తవారు రాజకీయంగా పైకి వచ్చారు. ఎందరినో మంత్రులను, ఎంపిలను చేసిన గనత నాటి సిఎంగా ఎన్టీఆర్‌కు దక్కింది. అణగారిన కులాలను, వర్గాలను అక్కున చేర్చుకుని వారికి రాజకీయంగా పదవులను కట్టబెట్టారు. 1996 జనవరి జనవరి18న ఎన్టీఆర్ మహాభినిష్క్రమణ చేసి అప్పుడే ఇరవై ఎనిమిదేళ్లు దాటింది. అయినా నేటికీ ఆయన జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచపోయారు. ఉమ్మడి ఎపిలో ఆయన తెలుగుదేశం పార్టీని పెట్టి, 9నెలల స్వల్పకాలంలోనే కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించారు. ఆనాటి రాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు. అన్నగా జనం గుండెల్లో నిలిచారు. ఇక చిత్రసీమలోనూ ఎందరికో చేయూతనిచ్చి ఆదుకున్నారు. అందుకే ఈ నాటికీ రామారావు  జనం మదిలో అన్నగా కొలువై ఉన్నారు. తెలుగు చిత్రపరిశ్రమకు 'పెద్దాయన'గా నిలిచిన నటరత్న యన్టీఆర్ నా అనుకున్నవారిని ఆదుకున్న తీరును ఈనాటికీ సినీజనం తలచుకుంటూ ఉన్నారు. అలా ఆయన అభిమానంతో వెలుగులు విరజిమ్మిన వారెందరో. తెరపై అనేక మార్లు శ్రీకృష్ణ పరమాత్మగా నటించి అలరించారు రామారావు. ఆపదలో ఉన్న భక్తులను ఆదుకొనే కన్నయ్యగా నటించడమే కాదు, నిజజీవితంలోనూ యన్టీఆర్ అదే తీరున సాగడం విశేషం. యన్టీఆర్ ఓ సారి నమ్మితే వారి కోసం ప్రాణమిస్తారని ప్రతీతి. యన్టీఆర్ విజయవాడలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వేశారు. తాను సినిమా రంగంలో అడుగుపెట్టగానే, తన తమ్ముడు త్రివిక్రమరావును, పుండరీకాక్షయ్యను మదరాసు పిలిపించుకొని వారిద్దరినీ భాగస్వాములుగా చేసి ఎన్.ఏ.టి. సంస్థపై చిత్రాలను నిర్మించారు... ఆ తరువాత పుండరీకాక్షయ్యను సోలో ప్రొడ్యూసర్ గానూ చేశారు. రామారావుతో పుండరీకాక్షయ్య 'శ్రీకృష్ణావతారం, భలేతమ్ముడు, ఆరాధన' వంటి  అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. అలాగే తనతో ఎన్నో చిత్రాల్లో నటించిన సత్యనారాయణకూ 'గజదొంగ'కు కాల్ షీట్స్ ఇచ్చారు. ఆ సినిమా ఎంత పెద్ద హిట్టో చెప్పక్కర్లేదు... ఇక యన్టీఆర్ తో 'సంసారం, దాసి' చిత్రాల్లో నాయికగా నటించిన లక్ష్మీరాజ్యం అడగ్గానే 'నర్తనశాల'లో అర్జున, బృహన్నల పాత్రల్లో అభినయించి అలరించిన తీరును ఎవరు మాత్రం మరచి పోగలరు? తరువాతి రోజుల్లో ఆమె నిర్మించిన 'మగాడు'లోనూ యన్టీఆర్ నటించారు. అలాగే తనతో పలు చిత్రాల్లో నటించిన భానుమతి సొంత చిత్రాల్లో నటించారు రామారావు. యన్టీఆర్ 'తాతమ్మకల'లో నటించినందుకు భానుమతి కోరగానే ఆమెకు కాల్ షీట్స్ ఇచ్చారు... యన్టీఆర్ వంటి సూపర్ స్టార్ కాల్ షీట్స్ ఇచ్చినా  'అమ్మాయి పెళ్ళి' అనే సాధారణ చిత్రం తీశారు భానుమతి. తన 'పల్లెటూరు'తోనే నాయికగా పరిచయమైన సావిత్రి దర్శకత్వం వహించిన 'మాతృదేవత'లో నటించి, ఆమెను డైరెక్టర్ గా ప్రోత్సహించారు. ఎన్టీఆర్ ఇటు రాజకీయ,చిత్రరంగాల్లో తనదైన ముద్రవేయడమే గాకుండా చరిత్ర సృష్టించిన మహనీయుడు. తెలుగు రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన నాయకుడు ఎన్టీఆర్. ఆయన రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించారు.



# సమగ్ర పంటల విధానం ఏదీ !

సంక్రాంతి సందర్భంగా అన్నదాతలను పొగడడం..రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం మినహా సంపూర్ణంగా రైతులకు మేలు జరగడం లేదు. ఏటా వారు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్తాయిలో ఆలోచన చేయడం లేదు. కేంద్ర రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణ అమలు చేయాల్సి ఉంది. పంట వేయడం మొదలు..కొనుగోళ్ల వరకు వారికి సాయంగా ఉండాల్సిన వ్యవసాయ శాఖ నిర్వీర్యంగా మారింది. పంటలు ఏవి వేయాలో..ఏవి వేయరకూడదో తెలియచేస్తూ ముందుకు సాగాల్సి ఉంది. బియ్యం ధరలు అనూహ్యంగా పెరుగుతున్నా..రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటల కొనుగోళ్లు అనేవి ఏటా ఓ ప్రహసనంగా మారుతున్నాయి. పంటలను సకాలంలో కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించే పక్కా ఏర్పాట్లు జరగడం లేదు. కేంద్రం ఈ-నామ్ ప్రవేశ పెట్టినా రైతుల కష్టాలు తీరడం లేదు. పంటలకు జాతీయస్థాయిలో ధరలు వస్తాయని, కొనుగోళ్లు జరుగుతాయని అంతా భావించారు. మోడీ ఇచ్చిన హామీలు ఏవీ అమలు జరగడం లేదు.దీంతో ఏటా పంట ఉత్పత్తులు అమ్ముకోవడంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఏవైనా ఈ నామ్ కింద వ్యాపారులు తీసు కోవడం లేదు. మొన్నటికి మొన్న ఖమ్మంలో మిర్చి అమ్ముకోవడానికి రైతులు నానాయాతన పడ్డారు. ఏటా ఈ ప్రహసనం జరుగుతున్నా కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. మార్కెట్లలో కూడా పక్కాగా నిబంధనలు అమలు జరగడం లేదు. తెలంగాణలో గోదాముల సంఖ్య పెరిగి నా అందుకు తగ్గట్లుగా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు పెరగడం లేదు. ఈ పరిస్థితి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నదే కాదు..దేశ వ్యాప్తంగా ఇదే తీరుగా ఉంది. జిల్లాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఒక ప్రహసనంగా మారింది. అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి నెలకొన్న పరిస్థితులకు పొంతన ఉంటడం లేదు. మిల్లర్లే నేరుగా కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. రైతు భరోసాకేంద్రాలకు వచ్చిన రైతులను కూడా మిల్లర్ల వద్దకు పంపుతుండగా వారు తేమశాతంపై మరోసారి పరీక్ష చేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ లక్ష్యం చాలా తక్కువగా ఉండటం వల్ల జిల్లాలో పండిన ధాన్యంలో దాదాపు 75 శాతం మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. రబీ పంటలు సాగు పూర్తయిన తరువాత కుప్పలను నూర్పిడి చేసి విక్రయించుకునేలా సిద్ధం అవుతున్నారు. ప్రధానంగా మద్దతు ధరలు దకకడం లేదు. అలాగే తేమశాతం పేరుతో తరుగు దోపిడీ సాగుతోంది. దడవాయి కూడా తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి, ప్రభుత్వం ఆంక్షలు, రవాణా ఛార్జీలు,నిల్వ చేసుకునే అవకాశం లేని వారు పొలాల్లోనే విక్రయిస్తున్నారు. ప్రధానంగా వ్యాపారులు బిపిటి ధాన్యం కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు కూడా భారీగా పెరగడంతో తెలంగాణ వ్యాపారులు జిల్లాకుపెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిసింది. జిల్లాకు చెందిన మిల్లర్లు తేమశాతం నిబంధనతో ఆంక్షలుపెట్టడం వల్ల రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. దీంతో రైతులు మిల్లర్లు, వ్యాపారులకు పొలాల్లోనే విక్రయించుకుంటున్నారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు పొలాల్లో కుప్పలు వేసి రెండో పంట వేశారు. మంచి ధర వచ్చినప్పుడు విక్రయించు కోవాలన్న లక్ష్యంతో వరిని కోసి కుప్పలు వేసి రబీ సాగు వైపు మొగ్గుచూపారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ఆధిపత్యం తగ్గించాలని, ఆర్‌బికే సిబ్బంది బాధ్యత తీసుకుని ఖచ్చితంగా కొనుగోలు చేస్తారని నిర్ధారణ అయిన తరువాతనే మిల్లర్ వద్దకు పంపాలని కోరారు. మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన పైర్లకు సంబంధించి రైతులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇకపోతే తెలంగాణలో పలు జిల్లాల్లో కంది రైతులకు వారు పండించిన కందులను మార్కెట్‌లో అమ్మడం ఇప్పుడు ఒక పరీక్షలా మారింది.మరోవైపు మద్దతు ధరలు పలకడం లేదు. మద్దతు ధర అందక ప్రైవేట్ వ్యాపారులకు కందులను తెగనమ్మకుంటు న్నారు. మిర్చి, పత్తిరైతుల పరిస్తితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పులు కానరావడం లేదు. మార్కెట్లో అమ్మకానికి సిద్దంగా ఉన్న నిల్వలు అమ్ముకోలేక అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మిర్చి,పత్తి రైతులు కూడా ఇదే రకమైన ఆందోళనలో ఉన్నారు. ఓ వైపు ధరలు లేక మరోవైపు కొనుగోళ్లు సాగక ఆందోళనగా చూస్తున్నారు. సంక్రాంతి వేళ ఆనందంగా ఉండాల్సిన అన్నదాతలు కొనుగోళ్లు లేక మరికొన్నిచోట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడం తలకుమించిన భారం అవుతోంది. దీనికితోడు గన్నీబ్యాగుల కొరత వారిని వేధిస్తోంది. ఇకపోతే నిల్వ చేయడానికి సరిపడా గోదాంలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులకు వ్యవసాయ మార్కెట్‌లో తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. 'ఈ-నామ్' విధానం పటిష్టపరచి జాతీయ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది. ఉన్నతాధి కారులు ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకొని ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. మిరప, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనలో రైతులకు న్యాయం జరగగడం లేదు. మొత్తంగా సమస్యలను వదిలి పాలకులు తమ సొంత విధానాలను రుద్దతున్నారు. అలా కాకుండా క్షేత్రస్థాయి అవగాహనతో రైతు సంక్షేమకార్యక్రమాలు అమలుజరగాల్సిన అవసరం ఉంది.

# నేటి ఎన్టీఆర్ వర్ధంతికి ఏర్పాట్లు

అనంతపురం,జనవరి17(శ్రీచక్ర) :

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని ఈనెల 18నఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా టిడిపి నేతలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తామన్నారు.పార్టీ శ్రేణులంతా అన్ని ప్రాంతాల్లో వర్ధంతిని ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గం కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఇందుకోసం మెగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ స్థాయిలో చాటినా... ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఎన్టీఆర్ సినీనటుడిగా ఉన్న సమయంలోనే రాష్ట్రంలో కరవు నెలకున్న సమయంలో దిల్లీలో జోలిపట్టి భిక్షమెత్తి ప్రజలను ఆదుకున్నారని కొనియాడారు. పార్టీపెట్టిన తొమ్మిదినెలలోనే అధికారంలోకి వచ్చి పేదలకు శాశ్వత పక్కాగృహ నిర్మాణ పథకం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనుడని అన్నారు.

# రీజినల్ రింగ్‌రోడ్డులో కదలిక

- సిఎం రేవంత్ తాజా ఆదేశాతో ఊపు
- కొలిక్కి రానున్న భూసేకరణ అంశం

హైదరాబాద్,జనవరి17(శ్రీచక్ర) :

రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పనులపై మళ్లీ కదలిక వచ్చింది. దీనికి సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఇక పనులు ముందుకు రానున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను మూడు నెలల్లో పూర్తి చేయాలని సిఎం తాజాగా సూచించారు. అడ్డంకులన్నీ అధిగమించి, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో పడింది. ఈ రోడ్డు నిర్మాణంతో తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత మెరుగు పడనుంది. ఇప్పటికే ఓఆర్‌ఆర్‌తో అనేక విధాలుగా రవాణా అందుబాటులోకి వచ్చి దూరాభారం తగ్గింది. అలాగే రీజినల్ రింగ్‌రోడ్డుతో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు దూరం తగ్గడంతో పాటు, హైదరాబాద్‌పై రవాణా భారం కూడా తగ్గనుంది. భారత్ మాల పరియోజన ఫేజ్‌వన్‌లో రీజనల్ రింగ్ రోడ్డు 158.645 కిలోమీటర్ల మేరకు తలపెట్టారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు తెలంగాణ సగం వాటా నిధులు భరించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 1935.35 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1459.28 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. గత ప్రభుత్వం సహాయ నిరాకరణ ధోరణి కారణంగా తొమ్మిది నెలలుగా ఈ ప్రాజెక్టు భూసేకరణలో ఎటువంటి పురోగతి లేదు. నేషనల్ హైవే అథారిటీతో తలెత్తిన చిక్కుముడులను పరిష్కరించే ప్రయత్నం జరగలేదు. దీంతో ఈ ప్రాజెక్టు ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీజనల్ రింగ్ రోడ్డుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అవుటర్ రింగ్ రోడ్డు లోపల అర్బన్ తెలంగాణ, ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ రీజనల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్ క్లస్టర్, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి పదేపదే ఈ విషయాన్ని తమ ప్రాధాన్యతగా చెప్పారు. ఇందులో భాగంగా రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవశ్యాన్ని సీఎం అధికారులతో చర్చించారు. ఈ రహదారి పూర్తయితే రవాణా సదుపాయాలతో సెమీ అర్బన్ జోన్లో కొత్త పరిశ్రమలు రావటంతో పాటు అభివృద్ధి వేగం పుంజుకుంటుందని అంటున్నారు. నిలిచిపోయిన భూసేకరణను రాబోయే 3 నెలలలో పూర్తి చేయాలని, భూసేకరణతో పాటే ఆర్‌ఆర్‌ఆర్ (పనులకు టెండర్లు పిలవాలని అధికారులను సీఎం తాజాగా ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తదుపరి భూసేకరణ ప్రణాళికను రూపొందించాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేసేందుకు ఆర్థికంగా ఎంత భారమైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడే ఏ కార్యానైనా నిర్వహించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ఈ క్రమంలో రీజినల్ రింగ్‌రోడ్డుతో రాష్ట్ర ముఖ స్వరూపం మారనుంది.

# ఎన్నికల సన్నద్ధతలో వైసీపీ అధినేత జగన్

- విపక్షాలకన్నా ముందుగానే శంఖారావం
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అనుచరగణం

విజయవాడ,జనవరి17(శ్రీచక్ర) :

మరోమారు గెలుపే లక్ష్యంగా వైసిపి అధినేత, సిఎం జగన్ అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ.. అందుకు అనుగుణంగా అభ్యర్థులను మారుస్తూ ముందుకు సాగుతున్నారు. తెరపైకి కొత్తవారిని తీసుకుని వస్తున్నారు. షర్మిల రాకతో పాటు, జనసేన, టిడిపి కూటమితో పాటు బిజెపిలు కూడా ప్రత్యర్థులుగానే ఉండనున్నారు. వీరిని ఎదుర్కొంటూ ముందుకు సాగాల్సి ఉంది. ఈ క్రమంలో నోటిఫికేషన్ రాక ముందు నుంచే ప్రజల్లో వైసీపి వాదం బలంగా వ్యాప్తి చేయాలని జగన్ పక్కా ప్లాన్ చేస్తున్నారు. అందులో బాగంగా 25న భీమిలి నుంచి ఎన్నికల శంఖారావం పూరించ నున్నారు. ఇప్పటికే అభ్యర్థుల జాబితాను దాదాపు ఖరారు చేస్తూ ఇన్‌ఛార్జులను నియమిస్తున్నారు. ఆఖరి నిమిషంలో ఒకట్రెండు తప్ప పెద్దగా మార్పులు ఉండబోవని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల నాటికి ఎలాంటి అసంతృప్తి లేకుండా సాఫీగా ఎన్నికలకు వెళ్లేందుకు ముందే అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. ఉన్నవారు ఉంటారు..పోయేవారు పోతారు..ఉన్నవారితోనే పోరాడాలనే పట్టుదలతో ఉన్నారు. దీనికితోడు తను నియమించిన వలంటీర్ల వ్యవస్థ బాగా పనిచేయగలదన్న ధీమాలో ఉన్నారు. అలాగే అన్ని కుటుంబాల కు అంతోఇంతో ఆర్థికసాయం అందినందున వారే తన ఓటు బ్యాంకుగా భావిస్తున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించామని దాన్నే జోరుగా ప్రచారం చేయాలని భావిస్తున్నారు. ఇంటింటికీ నేతలు వెళ్లి గతానికి ఇప్పటికి తేడాను వివరించాలని చెబుతున్నారు. వైనాట్ 175 నినాదాన్ని బలంగా వినించాలని చూస్తున్నారు. ఇప్పటికే వైఎస్‌ఆర్‌సీపీలో 59 మంది ఇన్‌ఛార్జులను నియమిస్తూ మూడు జాబితాలను విడుదల చేశారు. ఇప్పుడు నాల్గో జాబితాపై కసరత్తు చేస్తోంది. జగన్ జిల్లా పర్యటనకు వెళ్లే నాటికి దాదాపు అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల నియామకాలు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చే నాటికి వారంతా ప్రజల్లో ఉండాలని వైసీపీ నినాదమే జనంలో ఉండేలా చూస్తున్నారు.పొత్తులతో ప్రతిపక్షాలు ఇంకా చర్చల దశలో ఉన్నారు. ఇంకా అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి కసరత్తు చేయలేదు. పొత్తుల్లో భాగంగా సీట్లు ఖరారు చేసుకొని అభ్యర్థులను ప్రకటించే నాటికి అసంతృప్త రాగాలు తీవ్ర స్థాయిలో ఉంటాయని వైసీపీ భావిస్తోంది. ఆ వివాదాలను చల్లార్చే పనిలో ప్రతిపక్షాలు బిజీ అవుతాయని అది తమకు బాగా కలిసి వస్తుందని అంటున్నారు. దాన్ని ప్రజలకు చూపించి న్యూట్రల్ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. ఓవైపు షర్మిల కూడా దూసుకొస్తున్నారు. మరోవైపు టీడీపీ, జనసేన కూటమి ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగ ముందేఅభ్యర్థులు ఖరారు చేయడంతోపాటు, ప్రజల్లోకి వెళ్లాలని వైసీపీ ప్లాన్. పార్టీ నేతలంతా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగే టైంలోనే అధ్యక్షుడు జగన్ కూడా జిల్లాలు చుట్టేయాలని ప్లాన్ చేస్తున్నారు.ఈక్రమంలో నోటిఫికేషన్‌కు ముందే ఎన్నికల సన్నద్ధతతో ముందుకు సాగనున్నారు.ఇందుకోసం జనవరి 25న భీమిలిలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. అధికారిక కార్యక్రమాలు తగ్గించుకొని పూర్తిగా పార్టీపైనే ఫోకస్ పెట్టబోతున్నారు. ఓవైపు బహిరంగ సభల్లో పాల్గొంటూనే పార్టీకి అనుబంధంగా ఉండే సంఘాల నేతలతో ముచ్చటించనున్నారు. సర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధుల తో సమావేశం కానున్నారు. నోటిఫికేషన్ వెలువడే నాటికి రోజుకు రెండు సభల్లో పాల్గొనేలా వ్యూహాన్ని జగన్ రచిస్తున్నట్లు సమాచారం. ప్రతిపక్షాలు తీసుకొచ్చే మేనిఫెస్టుకు దీటుగా తాము అమలు పరిచిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. అదే టైంలో మరో ఆకర్షణీయమైన ఎన్నికల హామీ పత్రం కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల నాటికి వంద సభల్లో పాల్గొని తమ విధానాలు, అమలు చేసిన పథకాలు, అమలు చేయబోయే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రత్యర్థులపై పైచెయి సాధించేలా వ్యూహాన్ని రచిస్తున్నారు. నూటికినూరుశాతం ఎన్నికల హామీని అమలు చేశమాన్న ప్రచారం హైలెట్ చేయాలన్నది వ్యూహంగా ఉంది.

# పులులపై విషప్రయోగంతో కలకలం

- గ్రామస్థుల దుందుడుకు చర్యలపై కలవరం
- త్వరలో మహారాష్ట్ర, తెలంగాణ అటవీ అధికారలు భేటీ
- పులల రోణ చర్యలపై సమగ్ర అధ్యయనం

ఆదిలాబాద్,జనవరి17(శ్రీచక్ర) :

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులపై విషప్రయోగం ఇప్పుడు కలకలం రేపుతోంది. పులుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో కొందరు దుర్మార్గులు వాటిని మట్టుబెట్టడం ఆందోళన కలిగిస్తోంది. పదేళ్లుగా పులుల సంచారం పెరిగింది. తడోబా, తిప్పేశ్వరం నుంచి పులుల రాకపోకలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 2015లో మొదటిసారిగా కదంబా అడవుల్లో పులిని గుర్తించారు. ఇక ఆ తర్వాత క్రమంగా పులుల సంతతి పెరుగుతూ వచ్చింది. కాగా, ఇటీవల జరుగుతున్న ఘటనలు వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో రెండు పులులు మృతి చెందిన ఘటనపై ఈనెల మూడో వారంలో మహారాష్ట్ర, తెలంగాణ అటవీశాఖ అధికారుల మధ్య అంతర్రాష్ట్ర సమావేశం నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఎన్‌టీసీఏ సూచనల మేరకు రెండు రాష్ట్రాల మధ్య పులుల ఆవాసాలు, కారిడార్‌ల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహాలపై జాయింట్ మీటింగ్ ఉండనున్నది. అప్పటిలోగా పులుల అన్వేషణను ఒక కొలిక్కి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కాగజ్‌నగర్ పరిధి దరిగాం అటవీ ప్రాం తంలో రెండు పులులు మృతి చెందడంతో కలకలం రేగింది. ఇందులో ఒక పులి కళేబరాన్ని ఈ నెల 6న గుర్తించారు. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఇక ఇంకో పులి గాయాలతో అడవుల్లో తిరుగుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇక ఆ తర్వాత రెండు రోజులకే మరో పులి కళేబరాన్ని అధికారులు గుర్తించారు. రెండు రోజుల వ్యవధిలోనే రెండు పులులు మృత్యువాత పడడం అటవీ శాఖ, జిల్లా ప్రజలను ఉలిక్కి పడేలా చేసింది. అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. చనిపోయిన పశువుపై విషం చల్లడంతో.. ఆ మాంసాన్ని తిన్న పులి చనిపోయిందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వరుసగా రెండుపులుల మృతి అటవీ శాఖ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నది. ఎస్15, ఎస్9 పులుల మరణం అటవీ అధికారుల పర్యవేక్షణాలోపాన్ని చూయిస్తున్నది. రెండేళ్ల క్రితం ఎస్6 పులి నాలుగు పిల్లలకు జన్మనివ్వగా, ఇందులో ఒకటి గతంలోనే చనిపోయింది. మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నాయనేది ఇప్పటివరకు తెలియదు. అయితే 8 నుంచి 10 వరకు పులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయని గతంలో అధికారులు ప్రకటించారు. వాటి సంతతి 30 వరకు పెరిగిందని భావిస్తున్నారు.అవి ఎక్కడ ఉన్నాయనే సమాచారాన్ని మాత్రం అధికారులు ఇప్పటివరకు ధ్రువీకరించడం లేదు. గోప్యతా కారణాలు చూపుతూ, జిల్లాలో ఎన్ని పులులు ఉన్నాయ నే విషయాన్ని కచ్చితంగా వెల్లడించడం లేదు. కొత్తగా వచ్చిన పులులు ఇక్కడ ఇమడలేక, సరైన ఆవాసం, కావాల్సిన జత కుదరక తిరిగి వేరే ప్రాంతాలకు వెళ్తున్నాయి. అయితే ఈ పులుల సంచారంపై అటవీ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి పులులు 12 మార్గాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. కొన్ని ప్రాణహిత నదిని దాటి ఇంద్రావతి, తడోబా అభయారణ్యాలకు వెళ్తున్నాయి. కానీ కవ్వాల్ అభయారణ్యం వైపు వెళ్లడం లేదని తెలుస్తున్నది.విషప్రయోగంతో పులులు చనిపోయిన ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ జిల్లా అటవీ శాఖ, మిగిలిన పులుల జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నది. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని వాంకిడి మండలం సర్కేపల్లి చుట్టూ ఉన్న భారీ గుట్టలు, దట్టమైన అడవిని నలువైపులా ట్రాకింగ్ చేశారు. ఈ క్రమంలోనే అధికారులు మూడు పులుల పాదముద్రలను గుర్తించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్-9, ఎస్-15 మృతి చెందగా, ఎస్-9(మగపులి) జతగా ఉన్న ఎస్-6(ఆడపులి)తో పాటు వాటి పిల్లలైన మరో రెండు పులుల పాదముద్రలు గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఆ మూడు పులులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ఆరు పులుల్లో ఒకటి ఎప్పటి నుంచో తల్లిదండ్రులను వదిలేసి వేరుగా సంచరిస్తున్నదని, విషం తిన్న పులుల్లో అది ఉందా లేదా అనేది ఇప్పుడు సందేహంగా మారింది. ఈ విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.విషప్రయోగం చేసినట్లుగా అనుమానిస్తు న్న ఆరుగురిని అధికారులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. తామే విషప్రయోగం చేసినట్లు ఒప్పుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇకపోతే కాగజ్‌నగర్‌లో పులి మృతి చెందిన ఘటనపై ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమ ఎద్దును చంపిందన్న కోపంతోనే విషప్రయోగం చేసి పులిని హతమార్చినట్లు విచారణలో ముగ్గురు అంగీక రించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. విచారణ పూర్తయ్యాక ఘటనకు బాధ్యులైన అటవీశాఖ సిబ్బందిపైనా చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. దరిగాం గ్రామంతో పాటు సర్కేపల్లి, రెంగరీట్ గ్రామాలకు చెందిన 6 నుంచి 8 మందిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో గడిచిన కొన్నిరోజులుగా ఆయా గ్రామాల్లో టెన్షన్ నెలకొంది. కాగా విషం తిన్నట్లు అనుమానిస్తున్న మిగిలిన పులులతో పాటు, కనిపించకుండా పోయిన పులుల ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. పులుల ఆచూకీ తెలిసే వరకు ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగేలా ఉంది.

# పల్లె పొమ్మంటుంది - పట్నం రమ్మంటుంది





**300 కుటుంబాలు వలసబాట**

**పెద్దకడబూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

పనులు లేక పల్లె పొమ్మంటుంది, పట్నం కూలీలను రమ్మంటుంది అని రీతిలో వ్యవసాయ కూలీలు పిల్లాపాపలతో మూటాముల్లె నెత్తినేసుకొని పెద్దకడబూరు మండలంలోని చిన్నతుంళం, పెద్దకడబూరు గ్రామాల నుండి బుధవారం 300 కుటుంబాలు వలసబాట పట్టారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్ లో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతినడం, ఎల్లెల్సీకి సాగునీరు బంద్ కావడంతో గ్రామాల్లో ఉపాధి పూర్తిగా కరువై కూటికి సైతం ఇబ్బందిగా మారింది. దీంతో చేసేదిలేక కూలీలు పిల్లాపాపలతో తెలంగాణ, గుంటూరు, బెంగళూరులకు వలస వెళ్లారు. ఉపాధి పనులతో వలసలను నివారించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడంతో వలసలతో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. పాఠశాలల్లో చదివే పిల్లలను వదిలి కొందరు, ఇళ్ల వద్ద తమ పిల్లలను చూసుకొనే వారులేక తమ వెంబడే మరి కొందరు కూలీలు తీసుకెళ్లారు. ఇళ్ల వద్ద వృద్దులు మాత్రమే బిక్కుబిక్కుమంటూ కాలం వెలబుచ్చుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వలసల నివారణకు ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కార్మికులకు అండగా టిజివి ట్రేడ్ యూనియన్ నిలబడింది

● కర్నూలు టిడిపి ఇంచార్జి టి.జి భరత్



**కర్నూలు, జనవరి 17(శ్రీచక్ర) :**

కార్మికులకు అన్యాయం జరిగితే టిజివి ట్రేడ్ యూనియన్ ఒక చెక్‌పోస్టులా ఉంటుందని ఇతర యూనియన్లు సైతం జాగ్రత్తగా ఉండే పరిస్థితిని తీసుకొచ్చామని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. బుధవారం నగరంలోని సి.క్యాంపులోని టి.జి లక్ష్మీ వెంకటేష్ కమ్యూనిటీ హాల్‌లో టిజివి ట్రేడ్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టిజివి ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ పారిశ్రామికవేత్త కార్మికుల కోసం సొంతంగా ట్రేడ్ యూనియన్ ఏర్పాటుచేయలేదని చెప్పారు. కార్మికులకు అండగా ఉండి, వారి జీవితాలు బాగుండాలన్న మంచి ఉద్దేశంతో తన తండ్రి టి.జి వెంకటేష్ ఈ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేశారని తెలిపారు. టిజివి ట్రేడ్ యూనియన్ స్థాపించినప్పటి నుండి నేటి వరకు కార్మికులకు ఎన్నో విధాలుగా అండగా ఉన్నట్లు తెలిపారు. ఇక తన తండ్రి ప్రజలకు ఎంతో సేవ చేశారని.. ఆయన అడుగుజాడల్లోనే తాను కూడా నడుస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సేవ కోసమే రాజకీయాల్లో పోటీ చేస్తున్న తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. తాము ఒకరికి సహాయం చేయడమే తప్ప.. ప్రజల సొమ్ము ఆశించబోమన్న విషయం గుర్తించాలని ఆయన కోరారు. ట్రేడ్ యూనియన్ నాయకులు, సభ్యులందరూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. సొంతూరైన కర్నూలు ప్రజలు కష్టాలు పడకూడదని తామెప్పుడూ కోరుకుంటామన్నారు. తనను గెలిపిస్తే కర్నూల్లో ఉన్న ప్రతి ఒక్కరి భవిష్యత్తు బాగుండేలా చేస్తానని చెప్పారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కుతో పాటు, బిర్లాగేటు వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని బ్రతికే వారిని అక్కడి నుంచి తొలగించి వారిని రోడ్డున పడేశారన్నారు. తాము అధికారంలో ఉండింటే ఇలాంటి పరిస్థితి రాకుండా మున్సిపాలిటీకి ఆదాయం తేవడంతో పాటు చిన్న వ్యాపారస్తులకు న్యాయం చేసేవాళ్లమన్నారు. ఇవన్నీ గమనించి వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిజివి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బాలయ్య, గౌరవ అధ్యక్షుడు శేషగిరిశెట్టి, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర అధ్యక్షుడు జూటూరు రవి, అనుబంధ సంఘాల నాయకులు నరసింహులు, ఏసు, తిమ్మప్ప, రాఘవేంద్ర, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సెలవులు పొడిగింపు

**కడప సిటీ, జనవరి 17(శ్రీచక్ర) :**

ఏపీలోని సంక్రాంతి సెలవులు ఈనెల 19వ తారీకు తో ముగియ ఉన్నాయి అని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదరు విద్యాశాఖ అధికారిని కలిసి బడి పిల్లలకు ఇంకా మూడు రోజులు సెలవులు పొడిగించాలని కోరారు. వీరి యొక్క విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ అధికారులు జనవరి 22 వరకు బడి పిల్లలకు సర్వలో పొడిగించినట్టుగా సంబంధిత స్కూల్స్కు ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించిన దానికి బడి పిల్లలు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## నగరమా మేలుకో కార్యక్రమంతో ప్రతి ఒక్కరిలో చైతన్య తీసుకొచ్చాం

● కర్నూల్ టీడీపీ ఇన్‌చార్జీ టి.జి భరత్




**కర్నూలు, జనవరి 17(శ్రీచక్ర) :**

కర్నూల్ నగరంలో తాము చేపట్టిన తెలుగుదేశం పిలుస్తోంది నగరమా మేలుకో కార్యక్రమంతో ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకొచ్చామని కర్నూల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జీ టి.జి భరత్ అన్నారు. బుధవారం నగరంలోని 52వ వార్డులో చివరి రోజు నగరమా.. మేలుకో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి టిడిపి సూపర్ 6 పథకాలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూల్ నగరంలోని 33వ వార్డుల్లో 'నగరమా.. మేలుకో' కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందన్నారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. టీడీపీ పథకాలను వివరించినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజల ఆదాయం పెరగాల్సిందిపోయి.. ఖర్చులు పెరిగిపోయాయని భరత్ అన్నారు. నగరంలోని ఏ వార్డుకు వెళ్లినా ప్రజలు సమస్యలు చెబుతున్నారని అన్నారు. వార్డుల్లో పారిశుధ్యం పడకేసిందని.. మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. బుధవారపేటలో సెప్టిక్ ట్యాంక్‌లోపడి మహిళ చనిపోయిన ఘటనే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు.. మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని టీజీ భరత్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన అసెంబ్లీ ఇంఛార్జీ ఆర్షద్, టిడిపి సీనియర్ నేతలు బొల్లెద్దుల రామకృష్ణ, పోతురాజు రవి, అబ్బాస్, మన్సూర్ ఆలీఖాన్, రామాంజనేయులు, గున్నా మార్క్, నరసింహులు, ఆర్య శంకర్, నాగన్న, శ్రీనివాసులు, పవన్, మహిళా నేతలు మారుతి శర్మ, సౌభాగ్యమ్మ, విజయలక్ష్మి, రేష్మా భాయ్, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నగదు స్వాధీనం టూ టౌన్ సీఐ ఇబ్రహీం

**ప్రొద్దుటూరు, జనవరి 17(శ్రీచక్ర) :**



రసీదులు లేని 14,50,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ ఇబ్రహీం తెలిపారు. బుధవారం ఆయన ఈ విషయమై ఆయన మాట్లాడుతూ తాను తన సిబ్బంది తోటి వాహనాల తనిఖీ చేస్తుండగా ప్రొద్దుటూరు టౌన్ గవిని సర్కిల్ వద్ద నెల్లూరు జిల్లా ఉదయగిరి కి చెందిన ఒక వ్యక్తి బ్యాగ్ లో రూపాయలు 14, 50,000/- పెట్టుకొని నడుచుకుంటూ వెళుతుండగా సదరు వ్యక్తిని విచారించి అతని వద్ద గల నగదు కు ఎలాంటి రసీదులు చూపనందున సదరు నగదు స్వాదీనం చేసుకొన్నామని వివరించారు. ఈ నగదును తిరుపతి ఇన్ కం ట్యాక్స్ శాఖా అధికారులకు తగు చర్య నిమిత్తం పంపనున్నట్లు వివరించారు.

## అంగన్వాడీల డిమాండ్లు పరిష్కారించే వరకు పోరాటం ఆగదు




**పెద్దకడబూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కారించే వరకు తమ పోరాటం ఆగదని అంగన్వాడీ సంఘం నాయకురాలు జయమ్మ, రత్నమ్మ, చిట్టెమ్మ హెచ్చరించారు. బుధవారం పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదోని ప్రధాన రహదారిలో సీఐటియు ఆధ్వర్యంలో ఒంటి కాళిపై నిలుచుండి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అంగన్వాడీలకు నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తమ డిమాండ్లను పరిష్కారించే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## వైసీపీ మండల కన్వీనర్ కి పితృ వియోగం



**పెద్దకడబూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు గ్రామానికి చెందిన వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డికి పితృ వియోగం సంభవించింది. ఎంపీపీ శ్రీవిద్యకు మామ అయిన బాపురం సోమశేఖర్ రెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సోమశేఖర్ రెడ్డి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం సోమశేఖర్ రెడ్డి మృతదేహానికి మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ జేఏసీ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, వైసీపీ నాయకులు పూజారి ఈరన్న, ముక్కరన్న, అర్లప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న, ప్రధాన కార్యదర్శి రామన్న, నాయకులు భీమన్న, ఏలియస్, లింగమూర్తి, శివ కుమార్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

## ప్రధాని మోదీని కలిసిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్



**అనంతపురం, జనవరి 17(శ్రీచక్ర):**

శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కొటిక్స్ అకాడమీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలిసి ఘన స్వాగతం పలికిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్. రెండు పర్యాయాల పాటు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా పని చేసిన టీజీ వెంకటేష్ ను, ప్రధాని మోదీ కుశల ప్రశ్నలు వేసి బాగోగులను విచారించారు.

# నగదు విషయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు, జనవరి 17(శ్రీచక్ర) :**

ఎన్నికలు రానున్న నేపథ్యంలో డబ్బు విషయంలో ప్రజలు జాగ్రత్త వహించాలని, పోలీసులు ప్రజలను ఇబ్బంది పెట్టరాదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, ఫిబ్రవరి చివరి లోపు ఎన్నికల కోడ్ వచ్చే సూచనలు వున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇప్పటికే వారి కార్యకలాపాలైన ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఈ తరుణంలో డబ్బు, మద్యం విషయంలో పలు కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు. ఈ తరుణంలో ప్రజలు 50,000 మించిన నగదు కార్యకలాపాలు బ్యాంకుల ద్వారా గాని, లేదా సరైన ఆధారాలు కలిగి వుండి చేసుకోవాలని, 3కి మించిన మద్యం బాటిల్లు కలిగి వుండరాదని సూచించారు. నగదు రికార్డు లేకుండా అధిక మొత్తంలో కలిగి వుంటే తిరుపతి ఇన్ కం ట్యాక్స్ ఆఫీసు లో సరైన ఆధారాలు చూపి తిరిగి తెచ్చుకోవాల్సి వుంటుందని తెలిపారు. అంతేకాక లైసెన్స్ వెపన్స్ కూడా సంబంధిత పోలీసు స్టేషను లో అందించాలని వివరించారు. పోలీసులు కూడా ఎన్నికల కోడ్ రాక ముందే ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని సూచించారు.

**చంద్రబాబు శేష జీవితం జైలులోనే..**



చంద్రబాబు నాయుడుపై ప్రజల సొమ్ము స్వాహా చేశారని అవినీతి నిరోధక శాఖ ద్వారా పెట్టిన కేసులలో ఆయన 17ఏ తనకు వర్తించదని తెలిపారని, ఈ విషయమై దేశ అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసినా, రిమాండ్ రిపోర్టును సహేతుకమని వ్యాఖ్యానించారని వివరించారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, రానున్న రోజులలో చంద్రబాబు కోర్టుకు హాజరు కావడంతో పాటు శేష జీవితం జైలులో గడపక తప్పదన్నారు.

## పీసీసీ అధ్యక్షులుగా షర్మిలమ్మ నియామకంపై హర్షం



**కడప సిటీ, జనవరి 17(శ్రీచక్ర) :**

గుండ్లకుంట శ్రీరాములు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులుగా షర్మిలను నియమించటం చాలా సంతోషంగా ఉందన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటిసారిగా మహిళ పిసిసి అధ్యక్షురాలుగా షర్మిల నయమితులవటం సంతోషంగా ఉందన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు రెండుసార్లు పిసిసి అధ్యక్షులుగా ఉండటం మరలా తిరిగి ఆయన కుమార్తె షర్మిల పిసిసి అధ్యక్షురాలు అవడం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో శుభపరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులుగా గిడుగు రుద్రరాజును నియమించబడటం చాలా మంచి పరిణామం అన్నారు. ఆయన గత సంవత్సర కాలంలో పార్టీకి ఎన్నో సేవలు చేసి పార్టీని ముందుకు నడిపించారన్నారు. గత కొన్ని సంవత్సరాల గా ఎన్నో కష్టాలు పడ్డ పార్టీ కార్యకర్తలను ఉత్సాహంగా ముందుకు నడపడానికి పిసిసి అధ్యక్షురాలు, సి డబ్ల్యూ సి రుద్రరాజు ఇద్దరు నాయకత్వంలో మండల స్థాయి బూత్ కమిటీలను,మండల స్థాయి కమిటీలను ప్రోత్సహించడానికి కొన్ని ప్రణాళిక లను సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ షర్మిల నియామకంపై అవాకులు పేలుతున్న మంత్రి గుడివాడ అమర్నాథ్ ఒక లేడీ పార్టీకి ఒక కొత్త లేడీ అధ్యక్షురాలు వచ్చారని అన్నారు. లేడీ పార్టీ అని మాట్లాడే అమర్నాథ్ ఒకసారి ఆలోచించుకోవాలి, 135 సంవత్సరాల చరిత్ర కలిగిన మా పార్టీ గురించా మీరా మాట్లాడేది. వైఎస్ఆర్సిపి ఇంకొక నాయకుడు మాట్లాడుతూ కీర్తిశేషులు అయినటువంటి పార్టీ అన్నారు, కానీ మీరు కూడా గుర్తుపెట్టుకోవాలి ఈ పార్టీకి చావు లేదు మా పార్టీకి షర్మిల రావడంతో కొత్త భవిష్యత్ రాబోతుంది అన్నారు. ఇప్పటికే మా పార్టీ యొక్క గతంలో ఉన్న నాయకులు, మా టచ్ లోకి వస్తున్నారు కాబట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జాగ్రత్తగా మసులుకోని పక్షంలో రాబోయే రోజుల్లో మీ పార్టీకి 10 లేదా 12 సీట్లు కూడా రావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఆనంద్, ఎన్ ఎస్ యు ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా పైడి కాల్వ నాగరాణి



**కడప సిటీ, జనవరి 17(శ్రీచక్ర) :**

కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీగా పైడి కాల్వ నాగరాణీ నియామకాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంల లో రాష్ట్ర మీడియా ఇంచార్జ్ తులసి రెడ్డి చేతుల మీదుగా అందుకునారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పార్టీని ఇరవై ఇరవైనాలుగు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె విలేకరులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్,పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్య శర్మ, మాజీ సేవాదళ్ అధ్యక్షురాలు షేక్ గౌసియా, ఎన్ ఎస్ యు ఐ సుబ్బారెడ్డి, శ్యామలమ్మ, అబ్దుల్ రసూల్, కేతిరెడ్డి తిరుపాల్రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని ఘనంగా జరపాలి

**చింతూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం ఘనంగా జరుపుకోవాలని అరకు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు,రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పిలుపునిచ్చారు.తూర్పు మన్యంలోని 11 మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు,కార్యకర్తలు ఆయా మండలాల్లో ఈ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రా కదలి రా చంద్రబాబు సభకు 7000 మందితో ప్రొద్దుటూరు నుండి హాజరవుతున్నాం



● మాజీ ఎమ్మెల్యే వరద

**ప్రొద్దుటూరు, జనవరి 17(శ్రీచక్ర) :**

ఈనెల 19వ తేది శుక్రవారం జిల్లా లోని కమలాపురం నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న 'రా కదలి రా' కార్యక్రమానికి ప్రొద్దుటూరు నుండి 7000 మందితో హాజరవుతున్నామని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాల నందు పలువురు టిడిపి నాయకులు, వరద అభిమానులు, ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకొని చర్చించారు. 7వేల మంది నాయకులు, కార్యకర్తలతో సభకు వెళ్లనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, గ్రామ వార్డు స్థాయి టిడిపి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ద్వారా ఏర్పడిన ఎలక్షన్ కమిషన్



**భీమవరం, జనవరి 17 (శ్రీచక్ర) :**

భారత రాజ్యాంగం ద్వారా ఏర్పదిండి ఎలక్షన్ కమిషన్ అని, ఎన్నికలు సజావుగా జరగడానికి ఎలక్షన్ కమిషన్ దేశ వ్యాప్తంగా పని చేస్తుందని తహశీల్దార్ వై రవికుమార్ అన్నారు. భీమవరం తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో రెవెన్యూ శాఖ సహకారంతో ఎలక్షన్ కమిషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసన సభలు, శాసన మండళ్ళకు జరిగే ఎన్నికలను కమిషను నిర్వహిస్తుందని, ఈ ఎన్నికల నిర్వహణలో పర్యవేక్షణ, మార్గ నిర్దేశకత్వం, నియంత్రణ చేయవలసిన బాధ్యతను రాజ్యాంగం కమిషనుపై ఉంచిందన్నారు. ఎస్ టివో అల్లూరి రవివర్మ మాట్లాడుతూ ఎన్నికల కమిషను అధినేతను ప్రధాన ఎన్నికల కమిషనర్ అంటారని, మొదట్లో ఒక కమిషనరు ఉండేవారని, 1989 అక్టోబర్ 16న మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారని, అది కేవలం 1990 జనవరి 1 వరకు మాత్రమే కొనసాగిందని, మళ్ళీ 1993 అక్టోబర్ 1న ఈ నియామకాలు జరిగాయని, అప్పటి నుండి ముగ్గురు సభ్యుల కమిషను బాధ్యతలు నిర్వహిస్తూ వస్తూందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఎలక్షన్ కమీషన్ విది విధానాలపై వివరించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి ప్రసాద్, అర్ ఐ మూర్తి, ఎస్టివో ఆఫీస్ ఎస్ఏ పి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మందితో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు హాజరు

● ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



**ప్రొద్దుటూరు, జనవరి 17(శ్రీచక్ర) :**

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రొద్దుటూరు నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 5 బస్సులలో 250 మంది వెళ్లనున్నారవి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తారీఖున భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తూ విజయవాడ నడిబొడ్డున దాదాపు 19 ఎకరాల సువిశాల మైదానంలో 125 అడుగుల డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ప్రజాస్వామ్య వాదులకు శు భదినం అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ తమ ప్రభుత్వ హయాంలో జరగటం గర్వించదగ్గ విషయమని, వందల కోట్ల రూపాయల వ్యయంతో తమ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రపంచ పర్యాటకులు ఆకర్షించే విధంగా మ్యూజికల్ మౌంటెన్, లైబ్రరీ, మ్యూజియం, కన్వెన్షన్ సెంటర్, అంబేద్కర్ జీవిత విశేషాలను తెలియజేస్తూ థియేటర్ ఏర్పాటు చేశామని వివరించారు. పండుగ వాతావరణంలో విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో, రాష్ట్రం నలుమూలల నుండి దళిత జాతి నాయకులు, బిడ్డలు, అగ్రవర్ణాలకు చెందిన ప్రజాస్వామ్య వాదులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదు బస్సులలో దాదాపు 250 మంది విజయవాడకు చేరన్నట్లు, ఇందులో భాగంగానే ప్రొద్దుటూరులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు వారి వారి వాహనాలలో విజయవాడకు చేరుకుంటారని, సీఎం జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ అనంతరం తిరిగి ప్రొద్దుటూరుకు బయలుదేరుతామని వెల్లడించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 5 లక్షల 50వేల చెక్కు అందజేత



**భీమవరం, జనవరి 17 (శ్రీచక్ర) :**

వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుండి మంజూరైన 5 లక్షల 50వేల రూపాయల విలువ గల చెక్కును మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు రమేష్ కుమార్ కి బుధవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అందజేశారు.

# ఎస్ఏఈ హైడ్రోజన్ బాహా పోటీలలో సత్తా చాటిన విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) విద్యార్థులు



**భీమవరం, జనవరి 17 (శ్రీచక్ర) :**

డాక్టర్ బి.వి.రాజు ఫౌండేషన్ మరియు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ భీమవరం వారి విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఇండియా వారు దేశంలోనే మొట్టమొదటిసారిగా మధ్యప్రదేశ్ నందు ఇండోర్, పీఠంపూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన, జాతీయస్థాయి హైడ్రోజన్ బాహా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు లక్ష పదివేల రూపాయలు నగదు బహుమతిని సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ ఏ ఈ ఇండియా వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైడ్రోజన్ బాహా పోటీల్లో దేశం నలుమూలల నుండి జాతీయస్థాయిలో ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన ఆల్ టెరైన్ వాహనాలు ప్రదర్శించి వాటి పనితీరును పరీక్షిస్తారని. ఈ పోటీల్లో తమ కళాశాల నందలి మెకానికల్ మరియు ఎలక్ట్రికల్ విభాగం లోని మూడవ సంవత్సరం మరియు నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల టీం అమిగో తయారు చేసిన హైడ్రోజన్ వాహనం ఐదు విభాగాలలో ప్రథమ స్థానంలో నిలచి నగదు పురస్కారాన్ని అందుకున్నదని గర్వంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రోజన్తో నడిచే వాహనాలకు రానున్న రోజుల్లో చాలా ప్రజాదరణ ఉంటుందని ఎందుకనగా పెట్రోలు మరియు డీజిల్ తో నడిచే వాహనాల వల్ల కాలుష్యం ఎక్కువ మరియు వాటి నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతుందని రానున్న రోజుల్లో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారటం బ్యాటరీలతో నడిచే వాహనాల్లో ఉన్న ఇబ్బందులను హైడ్రోజన్ వాహనాలు అధిగమిస్తాయి అని ఆయన అన్నారు. తమ విద్యార్థులు 2016వ సంవత్సరం నుండి ఏపీ వి గోకర్ట్ వాహనాలు మరియు ఈ బైక్లను డిజైన్ చేసి తయారు చేస్తున్నారని తమ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలలో పాల్గొని వివిధ బహుమతులు సాధించడం వలన హీరో మోటో కార్ప్, ఎంజి మోటార్స్, టాటా టెక్నాలజీస్, జాన్ డీర్, అశోక్ లేలాండ్, మారుతి సుజుకి, రెనాల్ట్ నిస్సాన్, మెర్సిడెస్ బెంజ్, క్యాటరు పిల్లర్, హుందాయ్ మోటార్స్, మహేంద్ర అండ్ మహేంద్ర హెక్షగాన్ బ్లూ స్టార్, సైంట్, మరియు సైమన్స్ ఎనర్జీ వంటి బహుళ జాతి కంపెనీలో ఉద్యోగాలు పొందారని తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ దసిక సూర్యనారాయణ, విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ, విష్ణు కళాశాల మేనేజ్మెంట్ విద్యార్థుల అభ్యున్నతి కోసం తయారు చేసిన వాహనాలను ఆల్ టెరైన్ వాహనాలు (ఏటీవీ) పరీక్షించడానికి గో-కార్టింగ్ ట్రాక్‌ను భీమవరంలో నిర్మించారని, దీని వల్ల తమ విద్యార్థులు పోటీలలో పాల్గొనే ముందు ఈ ట్రాక్‌లో వాహనాలను టెస్ట్ డ్రైవ్ చేయడానికి వీలు కలుగుతుందని పేర్కొంటూ ఈ విధమైన సౌకర్యాలు కల్పించిన మేనేజ్మెంట్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె వి విష్ణు రాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మరియు సెక్రటరీ కె. ఆదిత్య విస్సం ఈ బాహా పోటీలలో అద్భుతమైన ప్రదర్శన కనుపరిచిన విద్యార్థులను అభినందించారు. అదే విధంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ వివిధ విభాగ అధిపతులు అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- డీఆర్వో శివన్నారాయణ రెడ్డి



**భీమవరం, జనవరి 17 (శ్రీచక్ర) :**

జిల్లాలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా అధికారులను జిల్లా రెవిన్యూ అధికారి బి. శివన్నా రాయణ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని జిల్లా రెవిన్యూ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని, గతంలో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే అవి సరి చేసుకుని వేడుకలు విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు మొదలు పెట్టాలన్నారు. గత ఏడాది మాదిరిగా స్థానిక జిల్లా కలెక్టరేటు అనుకుని ఉన్న పోలీసు ప్రేరేడు గ్రౌండు నందు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భీమవరం ఆర్డీవో గణతంత్రం దినోత్సవ వేడుకలు కార్యక్రమ నిర్వహణకు ఓవరాల్ ఇన్చార్జిగా ఉంటారన్నారు. స్టేజీ అరేంజ్మెంట్స్, సీటింగు అరేంజ్మెంట్స్, తదితర వేర్పాట్లును ఆర్డీవో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రౌండు ప్రిపరేషన్, పిచ్చి మొక్కలు తొలగింపు, గ్రౌండు చదును, శానిటేషన్ పనులను మున్సిపల్ శాఖ ద్వారా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ వాహనం, వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు ఉండేలా చూసుకోవాలని డిఎంహెచ్వో కు ఆయన సూచించారు. నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉండేలా చూసి, సేఫ్ సైడ్ గా జనరేటరు కూడా ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారికి ఆయన సూచించారు. త్రాగునీటి ఏర్పాట్లను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే వివిధ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని క్రోడీకరిస్తూ సందేశాత్మకంగా, వినూత్నంగా 10 శకటాలను రూపొందించాలన్నారు. జిల్లా అధికారులు అందరు సమిష్టిగా పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయ వంతానికి తమ వంతు కృషి చెయ్యాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా కలెక్టరు కార్యాలయం పరిపాలన అధికారి వైకెపి అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అయితపూడిలో కొల్లు వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో బారీగా బట్టలు పంపిణీ







- బారీగా తరలివచ్చిన వృద్ధులు, మహిళలు.
- వచ్చిన వాలందరికీ దుప్పట్లు, చీరలు, తువాళ్ళు, స్వీట్లు పంపిణీ

**కాజులూరు, జనవరి17(శ్రీచక్ర) :**

కొల్లు వెంకన్న ఫౌండేషన్ సారథ్యంలో కొల్లు వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు చేతులు మీదుగా సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నూతన వస్త్రాలు పంపిణీ చేసారు. ఈమేరకు కాజులూరు మండలం అయితపూడిగ్రామంలో కొల్లు వెంకన్న మనుమడైన వెకంటేశ్వరరావు ఆయన కుటుంబ సభ్యులు అందరూ కలసి గ్రామంలో ఆయన స్వగృహం నందువివిధ గ్రామాలనుంచి తరలివచ్చిన వందలాది మంది మధ్య కోలాహలంగా బట్టల పంపిణీ కార్యక్రమం జరిగింది. అయితే ఈకార్యక్రమం ఆయన పూర్వికులు నుంచి అనాదిగా కొనసాగుతుండగా ఆయన మనుమడైన వెంకటేశ్వర ఇండస్ట్రీస్ ,ఆక్వాఫామ్స్ అధినేత, అయిపూడి గ్రామ మాజీ సర్పంచ్ అయిన వెంకటేశ్వరరావు ప్రస్తుతం అనాదిగా కొనసాగుతున్న ఈకార్యక్రమం తాను బాద్యతగా స్వీకరించి ప్రతీఏడాది గతంకంటే మరింత ఉత్సాహంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు కు చీరలు ,వృద్దులకు దుప్పట్లు, తువాళ్ళు, స్వీట్స్ వచ్చినవారందరికి లేదనకుండా పంపిణీ చేసారు. దీంతో వివిద గ్రామాలనుంచి తరలివచ్చిన సుమారు 5 వందల మందికి పంపిణీ చేయగాకార్యక్రమంలో వరలక్ష్మ రవితేజ, స్మృతి ఛైతన్యకృష్ణ, మణికుమారి, పాప వేద పంపన వెంకటేశ్వరరావు ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేన యూత్ అధ్యక్షులు కూనపరెడ్డి ఆద్వర్యంలో శీలలో రంగవల్లి పోటీలు





- విజేతలకు ఇన్‌చార్జీ చంద్రశేఖర్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం
- శీల గ్రామం పల్లపు వీధిని రంగవల్లిలతో తీర్చి దిద్దిన మహిళలు

**కాజులూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

రామచంద్రపురం నియోజకవర్గ ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సౌజన్యంతో కాజులూరు మండలం జనసేన యూత్ అధ్యక్షులు కూనపురెడ్డి శివ కృష్ణ ఆధ్వర్యంలలో సంక్రాంతి పురస్కరించుకుని మన ఊరు మన ఆట కార్యక్రమంలో బాగంగా శీల గ్రామంలో రంగవల్లి పోటోలు అట్టహాసంగా నిర్వహించారు. ఈమేరకు జరిగిన కార్యక్రమంలో ముందుగా జనసేన తరుపున ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. కాజులూరు మండలం శీల గ్రామం, పల్లపువీధిలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో సుమారుగా అరవై మంది మహిళలు పాల్గొని తమతమ ప్రతిభను ముగ్గుల రూపంలో చక్కగా తీర్చి దిద్దారు. దీంతో పల్లపు వీధి అంతా వివిద అలంకారాలతో తీర్చిదిద్దిన రంగవల్లీలతో సుందరంగా చూపరులను ఆకట్టుకుంది. ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్నవారిలో అనూష ప్రథమ, పావని ద్వితీయ, మోహన తృతీయ ,బహుమతులకు అర్హులుగా ఎంపికయ్యారు. దీంతో వీరికి ఇంచార్జి చంద్రశేఖర్ తోపాటు ఇక్కడకు విచ్చేసిన పలువురు జనసేన శ్రేణులు, గ్రామస్తుల చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా గ్రైండర్ రెండవ బహుమతిగా మిక్సీ, మూడవ బహుమతిగా నాన్ స్టిక్ మూత ఉన్న కళాయి ,అలాగే స్పెషల్ బహుమతితులుగా నలుగరికి డిన్నర్ సెట్స్ ,అందజేసారు. ఈకార్యక్రమంలో బొండా వెంకన్న, గరగ కొండలరావు, సలాది పుష్పావతి, కృష్ణ చైతన్య, కృష్ణ అర్జున్, కోన నాగేశ్వరరావు, శ్రీను ,వాసురెడ్డి దుర్గారావు, రమేష్, గుండముక్కల వెంకటేశ్వరరావు, చిట్నడి వెంకటరమణ, మాధవరపు నానాజీతదితరులు పాల్గొన్నారు. దీంతో గ్రామంలో రంగవల్లి కార్యక్రమం చక్కగా తన ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ అధ్యక్షుడు కూనపరెడ్డి శివకృష్ణ ని ఈసందర్భంగా పలువురు అభినందించారు. అలాగే కార్యక్రమానికి సహకరించిన అందరికీ శివకృష్ణ కృతజ్ఞతలు తెలితయజేసారు.

# "ఆంధ్రాలో ఒక్కసారి కేంద్రంలో మరొక్కసారి బిజెపి సర్కార్" రావాలి

- మండల బిజెపి అధ్యక్షులు సలాది
- కాజులూరులో అబ్బురపరుస్తున్న వాల్ రైటింగ్స్
- మండలాధ్యక్షులు వీరబాబు చేతులమీదుగా ప్రారంభం




**కాజులూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

"ఆంధ్రాలో ఒక్కసారి కేంద్రంలో మరొక్కసారి బిజెపి సర్కార్" అనేనినాదంతో వాల్ రైటింగ్ పోర్టల్ కాజులూరు మండలంలో చూపరులను ఆకట్టుకుని అబ్బురపరుస్తున్నాయి. మండలంలో పలుచోట్ల ఈపోర్టర్లు వెలిసాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి, జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబుల పిలుపుమేరకు కాజులూరు మండలంలో బిజెపి లోగో వాల్ రైటింగ్ ను సంక్రాంతి పండుగ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు సలాది వీరబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా వీరబాబు మాట్లాడుతూ గతంలో మరొక్కసారి మోడీ సర్కార్ అనే నినాదంతో, వాల్ రైటింగ్ రాయడం జరిగిందని ,విషయం అందరికీ తెలిసినదే నని ప్రస్తుతం మరింత మార్పు చేసి కొత్త తరహాలలో" ఆంద్రలో ఒక్కసారి కేంద్రంలో మరొక్కసారి బిజెపి సర్కార్ "అనే నినాదంతో వాల్ రైడింగ్ మండలగ్రామాల్లో ప్రారంభించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజోపకార అభివృద్ధి పనులు దేశానికి,యువకులకి, మహిళలకి, రైతులకి, సైనికులకి, అండగా ఉంటూ వారికి పలు అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందన్నారు. అలాగే ప్రయాణ , విద్యుత్ రంగంలోనూ అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు తీసుకెళు తున్న నరేంద్ర మోడీ సర్కార్ బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో కూడా రావాలని గట్టి సంకల్పంతో కార్యకర్తలు అందరూ ప్రతి పోలింగ్ బూత్ లోను 5 వాల్ రైటింగ్స్ రాసే కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగిందని వీరబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శిలు పోలిశెట్టి శ్రీనివాస్ పుణ్యమంతుల శివాజీలతోపాటు ,బిజెపి శ్రేణులు , పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనం, విగ్రహ ప్రారంభోత్సవంకు అందరూ రావాలి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



**భీమవరం, జనవరి 17 (శ్రీచక్ర) :**

దేశానికే ఆదర్శంగా డా బి ఆర్ అంబేద్కరు స్మృతివనం, 125 అడుగుల విగ్రహ ప్రారంభోత్సవం కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా మానవతా వాదులంతా హాజరై విజయవంతం చేయాలి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు డా.బి ఆర్ అంబేద్కర్ చరిత్రను భావితరాలకు తెలియజేసే అద్భుతమైన కార్యక్రమం ఈనెల 19వ తేదీన విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదాన ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ జరగనుందని ఈ కార్యక్రమం కు కుల మత ప్రాంతీయ భేదాలు లేకుండా మానవతావాదులంతా హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ చీఫ్ విప్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ స్వరాజ్యమైదానంలో డాక్టరు బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 19 వ తేదీన ఆవిష్కరించనున్నారని అన్నారు. 200 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ 600 కోట్లతో విజయవాడ స్వరాజ్య మైదానంలో నిర్మించిన 125 అడుగుల డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడుగు, బలహీన వర్గాలవారు అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజయవాడకే సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలిచే అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి ఒక్కరు కుల,మత,పార్టీలకు ఆతీతంగా తరలిరావాలని ఆయన అన్నారు .అంబేద్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి అందరివాడైన అంబేద్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరిని ఆకర్షించేలా అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మిని థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి వాటితో అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. మూడు వేల మంది కూర్చునే మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు 2000 మంది కూర్చునే ఓపెన్ థియేటర్, పదివేల పుస్తకాలతో కూడిన లైబ్రరీ, అంబేద్కర్ చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా ఒక అద్భుత మైన గొప్ప కళాఖండాన్ని తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం వలన విజయవాడ నగరం ప్రజాదరణ పొందిన గొప్ప పర్యాటక,పుణ్య కేంద్రంగా మారబోతుందన్నారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు. అటువంటి ఈ గొప్ప కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, ప్రతి ఒక్కరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19 వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పండగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, వీటిలో రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసిబి డైరెక్టర్ జాన్ కెనడి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల రవి కుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రా కదిలి రా మండపేట సభకు తరలిరండి

- డాక్టర్ చప్పిడి పిలుపు



**రామచంద్రపురం, జనవరి 17 (శ్రీచక్ర) :**

ఈనెల 20వ తారీఖున మండపేటలో జరగనున్న రా కదలి రా సభను జయప్రదం చేయాలని తెలుగుదేశం శ్రేణులకు ప్రజలకు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ద్రాక్షారామ ప్రతిభా కాలేజ్ వద్ద జరిగిన రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు పితాని భద్రం అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సమావేశానికి విచ్చేసిన రామచంద్రపురం రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నాయకుల సమన్వయంతో పనిచేసి ఈనెల 20న జరగబోయే సభను జయప్రదంచే యాల్సిందిగా వారికి దిశ నిర్దేశం చేశారు. జగన్ అరాచక కక్షపూరిత పాలనను త్వరలోనే గద్దె దింపేలా కృషిచేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు పాల్గొనే ఈ సభకు అశేష జనవాహిని తరలి రావాలని కోరారు. అనంతరం జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ సతీమణి ఆత్మ శాంతి చేకూరాలనిసమావేశంలో ఒక్క నిమిషం మౌనం పాటించారు. అలాగే పార్టీ సీనియర్ నాయకులు అలక కృష్ణంరాజుని ఈసందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పెంకె సాంబశివరావు, కొండబాబు, సురేష్ , బాబి, ఎస్సీ సెల్ నాయకులు కత్తుల వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్ వనం గోవిందరాజులు , వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

# మృత్యు కుహరంలా గుంతలు





- నిండు ప్రాణం బలి
- పత్తాలేని ఆర్ అండ్ బి అధికారులు
- ఐటీడీఏ పీవో స్పందించాలి

**చింతూరు, జనవరి 17 (శ్రీచక్ర) :**

మండలంలోని పోతనపల్లి గ్రామం నుండి మోతుగూడెం వరకు ఉన్న రహదారి గుంతల మయంగా తయారైంది. ఈ గుంతల రహదారి ప్రయాణికులకు శాపంగా మారి నిండు ప్రాణాలను బలి తీసుకుంటుంది. పోతనపల్లి గ్రామం నుండి గొడ్లగూడేం క్రాస్ రోడ్ వరకు ప్రయాణించాలి అంటే వాహనదారులకు నరకం కనిపిస్తుంది. ఈ దారి అంతా గుంతలు గుంతలుగా మారి మృత్యు కుహరంలా తయారయింది. ఈ రహదారి కుండా ప్రయాణించేటప్పుడు వాహనదారులు కాస్త ఆదమరిస్తే ప్రమాదం కొని తెచ్చుకోవాల్సిందే. ఒక్కొక్కసారి ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తుంది. గత కొన్ని నెలలుగా ఈ రహదారి గుంతల మయంగా మారిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. రహదారులను పర్యవేక్షించాల్సిన చింతూరు ఆర్ అండ్ బి అధికారులు పత్తా లేకుండా పోయారని మండలవాసులు విమర్శిస్తున్నారు. అసలు చింతూరు మండలానికి ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారా? లేరా ? అని ప్రశ్నిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం చింతూరు కు చెందిన అంగర ప్రశాంత్(23) ఓ పని నిమిత్తం రాజమండ్రి వెళ్లి తన ద్విచక్ర వాహనం పై రాత్రి సమయంలో చింతూరుకు తిరిగి వస్తున్నాడు. గొడ్లగూడెం క్రాస్ రోడ్డు నుండి పోతనపల్లికి వచ్చే రహదారిలో ఉన్న గుంతలో ప్రశాంత్ ద్విచక్ర వాహనం పడి ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ప్రశాంత్ తలకి తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రశాంత్ ను హుటా హుటిన ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ప్రశాంత్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి చెందిన ప్రశాంత్ నెమ్మదస్తుడు,మంచి ప్రవర్తన కలిగిన యువకుడు అని పేరు ఉంది. ఈ గుంతల రహదారి కుండా వస్తుండడంతోనే ప్రమాదం చోటుచేసుకుని మంచి యువకుడైన ప్రశాంత్ మృతి చెందాడని పలువురు అంటున్నారు. ప్రశాంత్ మృతి చెందడంతో అతని తల్లిదండ్రులు శోకసముద్రంలో కొట్టుమిట్టాడారు. ఆర్ అండ్ బి అధికారులే ప్రశాంత్ మృతికి బాధ్యులని పలువురు అంటున్నారు. ఐటిడిఏ పిఓ కావూరి చైతన్య గుంతల మయమైన ఈ రహదారి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. గుంతల మయమైన ఈ రహదారికి మరమ్మత్తులు చేయకపోతే మరిన్ని నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు.

# టోర్నమెంట్లో విజయం సాధించిన నందన మారరెళ్ల (మార్నింగ్ స్టార్స్) టీం

**ఒంగోలు, జనవరి 17 (శ్రీచక్ర) :**


సంక్రాంతి సందర్భంగా కనిగిరి మండలం నందనమారేళ్ళ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించింది ,జరిగింది .ఈ యూర్నమెంట్ లో, 20 టీంలు పాల్గొన్నారు, .ఫైనల్ మ్యాచ్ గా నందనమారెళ్ల టీం విజయం సాధించింది. కెప్టెన్ వినయ్ వైస్ కెప్టెన్ జైపాల్ టీం సభ్యులు ఆమోస్ పుష్పరాజ్ స్టీఫెన్ వంశీ సందీప్, బాబు ,దీవెన్, సన్నీ, తేజ, చిన్నా, రామకృష్ణ చందు, కిరణ్ రన్నర్ గా గులుగులూరు వారి పల్లె నిలిచింది. కెప్టెన్ ఆదిరెడ్డి మరియు టీం మొదటి బహుమతిగా జి వెంకట్ రెడ్డి గారు ,స్పాన్సర్ చేయడం జరిగింది . వెంకట్ రెడ్డి బహుమతిగా వెంకట రెడ్డి మాన్ అఫ్ ది మ్యాచ్ ప్రైస్ ను వంగిపురం ఆనంద్ స్పాన్సర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వంగేపురం కార్తిక్ రాజు పాల్గొని మాట్లాడుతూ, ఆటలు,మానసిక ఉల్లాసానికి ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. అనంతరం ,ప్రైస్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రికెట్ అభిమానులు, ఆర్ఎంపి, చంద్ర ,గ్రామ ప్రజలు అందరు పాల్గొని హర్షం వ్యక్తం చేయడం జరిగింది.



# గూడూరు ప్రభుత్వఆసుపత్రి నిర్లక్ష్యం వల్ల స్టేడియంలోకి మురికి నీరు

**గూడూరు రూరల్, జనవరి 17 (శ్రీచక్ర) :**

సంక్రాంతి సెలవుల్లో క్రికెట్ స్టేడియంలో క్రికెట్ ఆడుకుంటున్న క్రీడాకారులకు అంతరాయం. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మురికి నీరు, కొత్త భవనానికి వినియోగించిన ఇసుక సిమెంట్ కలిపిన నీళ్లు వదిలేసిన ఆసుపత్రి సిబ్బంది, కాంట్రాక్టర్లు. క్రికెట్ స్టేడియం లోకి మీరు వచ్చిందని విషయం,గత నాలుగైదు నెలల నుంచి చెబుతున్న పట్టించుకోని ఆసుపత్రి అధికారులు, కాంట్రాక్టర్లు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గది ముందు నీటితో నిండిపోయినా పట్టించుకోని ఆసుపత్రి సిబ్బంది ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ స్టేడియం లోకి వచ్చి గ్రౌండ్ లోకి వచ్చిన నీటిని పరిశీలించి, ఆసుపత్రి పారిశుద్ధ్య సిబ్బందిని పిలిచి నీటిని లేకుండా చూడాలని చెప్పినా ఒక్కరు కూడా రాకపోవడం గమనార్హం. గూడూరు ప్రజా ప్రతినిధి అండతోనే గూడూరు ప్రభుత్వస్టేడియంలో కి నీటిని వదిలేస్తున్న ప్రభుత్వఆసుపత్రి సిబ్బంది. కాంట్రాక్టర్. దయాలసిస్ కేంద్రం పక్కన కొత్త భవనం నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ కి గూడూరు ప్రజాప్రతినిధి అండదండలు ఉండటం తోనే, కనీసం స్టేడియంలో కి నీటిని ఇలా వదులుతారు అని సూపరింటెండెంట్ అడిగినా సమాధానం లేదు. కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయక పోవడమే, కాంట్రాక్టర్ కి ప్రజాప్రతినిధి అండ ఎంతగా ఉందొ అర్థం అవుతుంది. గూడూరు ప్రజా ప్రతినిధికి కొందరు జర్నలిస్ట్ లు, క్రీడాకారులు ఫోన్ చేయగా, నేను చూసుకుంటా లే అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోనే తెలుస్తుంది. కాంట్రాక్టర్ కి గూడూరు ప్రజాప్రతినిధి అండదండలు ఎంత ఉన్నాయో అని చివరికి జర్నలిస్ట్ లు, క్రీడాకారులు స్టేడియంని శుభ్రం చేస్తుంటే, ఆసుపత్రి సూపరింటెండెంట్, పారిశుధ్య సిబ్బంది ని వెంటనే అక్కడ కి పిలిపించి, నీటిని రాకుండా అడ్డుకట్ట వేయడం జరిగింది. నీరు ఉన్న ప్రదేశం లో మట్టిని వేయించే పనిలో ఉన్నారు స్టేడియంలో కి నీళ్లు రావడం తో, క్రికెట్ మ్యాచ్ ఆగిపోయింది. పొద్దున్న ఆసుపత్రి సిబ్బంది కి, అది పనిగా, స్టేడియంలోకి నీళ్లు వదులుతారు ఏమో వదలొద్దు అని చెప్పినా, నిర్లక్ష్యం గా స్టేడియంలో కి నీటిని వదిలేసిన కాంట్రాక్టర్. గూడూరు ఆర్డీఓ సార్, తిరుపతి కలెక్టర్ సార్, నిర్లక్ష్యం గా రెండు మూడు రోజులకు, ప్రభుత్వఆసుపత్రి లోని మురికి నీరు, సిమెంట్ కలిపిననీటిని వదిలేసిన కాంట్రాక్టర్ ప్రభుత్వఆసుపత్రి సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి అని క్రీడాకారులు,జర్నలిస్ట్ లు, గూడూరు ప్రజలు, ప్రేక్షకులు కోరుకుంటున్నారు.





# గూడూరులో రోడ్లు పగలగొట్టేస్తున్నా పట్టించుకోనే నాయకులు,అధికారులు లేరా




**గూడూరు రూరల్, జనవరి 17 (శ్రీచక్ర) :**

**తిరుపతి జిల్లా గూడూరు లో ఏజీ %డ%పీ గ్యాస్ కంపెనీ గత సంవత్సరంనుండి గూడూరు లోని ప్రధాన రోడ్లు, వీదులలో, చిన్న చిన్న సంధులలో కూడా సిమెంట్ రోడ్లు పగలకొట్టిగ్యాస్ కంపెనీ పనులను చేస్తున్న నిర్వాహకులు గూడూరు మునిసిపల్ కమిషనర్ ను పలుమార్లు, గూడూరు లో గ్యాస్ కంపెనీ వాళ్ళు రోడ్లు పగలకొట్టి గ్యాస్ లైన్ వేస్తున్నారని ఫిర్యాదు చేస్తే, స్పందించని మున్సిపల్ కమిషనర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పునరుద్దరణ చేస్తామని చెప్పి నెలలు గడిచినా ఇప్పటికి ఒక్క దగ్గర కూడా సిమెంట్ రోడ్డు వేసిన దాఖలాలు లేవంటున్న గూడూరు పట్టణ ప్రజలు.**





# సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం





- **డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి**
- **మానవహారంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, తిరుపతి ఎం.పి, తిరుపతి మునిసిపల్ కమిషనర్**
- **డా. బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు అమలు చేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం: జిల్లా కలెక్టర్**
- **సామాజిక సాధికారత మన రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యం: తిరుపతి ఎం.పి.**

**తిరుపతి, జనవరి 17 (శ్రీచక్ర) :**

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన "సామాజిక సమత సంకల్పం" కార్యక్రమంలో భాగంగా నేడు బుధవారం ఉదయం స్థానిక ఏపీఎస్ఆర్టిసి బస్టాండ్ సర్కిల్ నందు గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత కలిసి పూలమాల వేసి, మానవహారంలో పాల్గొని మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం డా. బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలతో సామాజిక న్యాయం అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా. బి.ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని, ఈ నెల జనవరి 19 న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు విజయవాడలోని స్వరాజ్ మైదాన్ లో దాదాపు రూ. 400 కోట్లతో సుమారు 20 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెడస్టల్ తో కలిపి 210 అడుగులు ఉంటుందని ఆ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం లో భాగంగా జిల్లాలో ఈ నెల జనవరి 4 నుండి 19 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విగ్రహం విజయవాడ నడి బొడ్డున ఏర్పాటు చేయడంతో ఇది విజయవాడకే కాదు మన యావత్ ఆం.ప్ర రాష్ట్రానికి తలమానికంగా (ఐకాన్ గా) ఉంటుందని తెలిపారు. సచివాలయ స్థాయిలో కూడా వివిధ రకాల వక్తలతో గ్రామస్తులందరికీ వివరించి సమతా భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అలాగే ప్రతి సచివాలయం నుండి నలుగురు నుండి ఐదు మందిని ఈ నెల జనవరి 19వ తారీకున విజయవాడలో జరిగే డా. బి ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బస్సు ఏర్పాటు చేసి పంపడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు అంబేద్కర్ భావజాలాన్ని ప్రజలకు తెలియజేసి మన రాష్ట్ర ప్రభుత్వం తదనుగుణంగా అంబేద్కర్ భావజాలంతో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించేలా కార్యక్రమాల రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని, ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉన్నదని తెలిపారు. తిరుపతి ఎం.పి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా 125 అడుగుల అతిపెద్ద అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అలాగే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో నేడు పరిపాలన సాగుతోందని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి కుటుంబాలలో ఆర్థిక స్థిరత్వం, సమానత్వం కోసం గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, బి.సి వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు.

# హెల్తీ విలేజ్ జాతీయ వర్క్ షాప్ ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్





**తిరుపతి, జనవరి 17 (శ్రీచక్ర) :**

రేపు జనవరి 18 నుండి 20 వరకు మూడు రోజులు స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భారత పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ వారి సూచనల మేరకు ఆం.ప్ర రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై (%బూణ+%లు) రెండవ థీమ్ అయిన ఆరోగ్యకరమైన గ్రామం (హెల్తీ విలేజ్) అంశంపై జాతీయ వర్క్‌షాప్ నకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ గారు, ఆం.ప్ర కమిషనర్ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ శ్రీమతి సూర్య కుమారి, స్పెషల్ కమిషనర్ సిరి ఏర్పాట్లను పర్యవేక్షించారని తెలిపారు. ఈ వర్క్ షాప్ నకు కేంద్ర సహాయ మంత్రి పంచాయితీ రాజ్ శాఖ కపిల్ మోరేశ్వర్ పాటిల్, వివిధ రాష్ట్రాల నుండి రాష్ట్ర స్థాయి అధికారులు, డిపీఓ లు, జడ్పీ సిఈఓ లు ఇతర అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు జడ్పీ చైర్మన్లు, జడ్పీటిసి, సర్పంచ్ లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి మరియు మన రాష్ట్రం నుండి సుమారు వెయ్యి మంది పాల్గొననున్నారని తెలిపారు. సంబంధిత అంశాలపై వైద్య శాఖ, డిఆర్డిఎ, మెప్మా, టీటీడీ,మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్ లు ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. మొదటి రోజు రేపు ఉదయం రిజిస్ట్రేషన్ తదుపరి వర్క్ షాప్ కార్యక్రమాలు 10 గం.లకు ప్రారంభం అవుతాయని, గౌరవ మంత్రుల సందేశం ఉంటుందని, కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి గిరి రాజ్ సింగ్ వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ సందేశం ఇస్తారని తెలిపారు. రేపటి రోజున ఉదయం సమావేశం నిర్వహణ అనంతరం మధ్యాహ్నం సంబంధిత అంశాలపై గ్రూప్ డిస్కషన్స్ జరగనున్నాయని, 20వ తేదీన క్షేత్ర సందర్శన ఉంటుందని తెలిపారు.

# "రా.. కదలిరా.. కార్యక్రమానికి గ్రామాల వారిగా తరలిరండి

- **టీడీపీ శ్రేణుల సర్వసభ్య సమావేశంలో జాతీయనేత నల్లారి**

**పీలేరు, జనవరి 17 (శ్రీచక్ర) :**



అన్నమయ్య జిల్లా:పీలేరు జనవరి 24న పీలేరులో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి,ప్రధాన ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు, 2024ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ గెలుపే లక్ష్యంగా "రా.. కదలిరా..లి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని, తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు మండల, గ్రామీణ ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అనుబంధ సంఘాలకు పిలుపు నిచ్చారు. ఆయన పీలేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన క్షేత్ర స్థాయి,భూత్ స్థాయిలో తమకు అనుకూలంగా ఉన్న వాహనాల్లో పెద్దఎత్తున తరలి వచ్చి కార్యక్రమానికి విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా ఎస్సి, ఎస్టీ,బిసి,మైనార్టీ వర్గాల కార్పోరేషన్లను నిర్వీర్యం చేస్తూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాలను తూట్లు పొడిచిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి గద్దె దింపడమే తెలుగుదేశం పార్ట్ లక్ష్యమని అన్నారు. అపద్దాలుచెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డిపై ప్రజలు నమ్మకం కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలోఅన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, దుర్మార్గపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, రాష్ట్రంలో మళ్ళీ పూర్వవైభవం రావాలని అందుకుఅందరూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొన్నారు.

# ఈనెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరగాలి : పోలా భాస్కర్





**తిరుపతి, జనవరి 17 (శ్రీచక్ర) :**

ఎన్నికలకమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ -2024 ఓటర్ల తుది జాబితా ఈనెల 22 న ప్రకటించాలని, ప్రకటన అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు మరుసటి రోజే జాబితా అందించాల్సి ఉంటుందని రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో అబ్జర్వర్ గా మూడవ సమావేశం జిల్లా కలెక్టర్ తో , ఇ ఆర్ ఓ లతో ఓటర్ల తుది జాబితా ప్రచురణ పై చేపట్టాల్సిన చర్యలపై రోల్ అబ్జర్వర్ పలు సూచనలు చేసారు. ముందుగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ముసాయిదా జాబితా 2023అక్టోబర్ 27 ప్రకటించడం జరిగిందని, అన్ని రకాల ఫారమ్స్ 4,15,235 అందాయని 0.17 శాతం మాత్రమే పరిశీలనలో వున్నాయని మిగిలినవి పరిశీలించి పూర్తి చేసామని అన్నారు. నియోజక వర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరిపి ఎస్ ఎస్ ఆర్ -2024 పై సమాచారం ఎప్పటికప్పుడు అందించడం జరుగుతున్నదని అన్నారు. ఈనెల 22 న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు జిల్లా యంత్రాంగం సిద్దంగా వుందని వివరించారు. రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ జిలాల్లో అందిన పిర్యాదులు పూర్తిగా పరిష్కరించాలని, తుది జాబితా ప్రచురణ కోసం ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ బీటా వర్షన్ అందుబాటులోకి తెచ్చిన విషయం తెలుసు తప్పనిసరి ఎ ఇ ఆర్ ఓ లు, ఇ ఆర్ ఓ లు పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలించి ఓటర్ల జాబితా, సీరియల్ నెంబర్లు వంటివి నిర్ధారణ జరగాలని అన్నారు. నియోజక వర్గాల వారిగా జాబితా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని వారివద్ద తప్పనిసరి రసీదు పొందాలని అన్నారు. ఇక కొత్త ఓటర్లకు కార్డుల ప్రింటింగ్, పంపిణీ పై ఎన్నికలకమిషన్ అనుమతితో త్వరగా ఓటర్లకు అందించాలని అన్నారు. ప్రతి కొత్త నమోదు, తోలగింపు, మార్పు ఓటర్ల కు సంబంధించి ఫైల్స్ సిద్దంగా వుండాలని, ఎన్నికల కమిషన్ పరిశీలనలో వీటిని పరిశీలిస్తారని అన్నారు. ఈ సమీక్షలో తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డిఓ లు కిరణ్ కుమార్, నిశాంత్ రెడ్డి, చంద్రముని, శివశంకర్ రెడ్డి, ఎ ఇ ఆర్ ఓ లు , సెక్షన్ సూపరిన్ టెన్ డెంట్ చంద్ర శేఖర్ అధికారులు పాల్గొన్నారు.

# "పేద వారి సొంత ఇంటి కల" ను నెరవేర్చడానికి అధికారులు కృషి చేయాలి : శంకర్

**వరదయ్యపాలెం, జనవరి 17 (శ్రీచక్ర) :**



మండలంలోని వరదయ్య పాలెం గ్రామ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కాల యాపన చేస్తున్న రెవెన్యూ అధికార యంత్రాంగం, ఇకనైనా మేలుకొని ప్రజల సమస్యలను తీర్చే విధంగా ఉండాలని బిఎస్పి మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు.ఇందిరానగర్,ముస్లిం పాలెం ప్రజల బాధలు తీర్చాలని కోరుతూ, ఇళ్ళు లేని పేద ప్రజలకు లక్షల రూపాయలు పెట్టీ భూములు కొని,వాటిని తిరిగి భూములను సాగు చేసుకునే పరిస్థితి తీసుకురావద్దని,"పేదల సొంత ఇంటి కల" కలగానే మిగిలి పోకుండా చూడాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన



**కోట, జనవరి 17 (శ్రీచక్ర) :**

తిమ్మనాయుడుపాలెం, జరుగుమల్లి,నెల్లూరు పల్లి కొత్తపాలెం,వంజివాక గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పంచాయతీ కార్యదర్శి షేక్. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధికారులు, బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి అందే పూర్తి సంక్షేమ పథకాలుపై ప్రజలందరూ అవగాహన చేసుకోవాలన్నారు. అదేవిధంగా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందనివారు ఇప్పుడైనా అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భవాని, పంచాయతీ కార్యదర్శి షేక్.రియాజుద్దిన్,గ్రామ రెవిన్యూ అధికారి కృష్ణయ్య,వల్లిపేడు క్లస్టర్ దినేష్,బీజేపీ నాయకులు రూపేష్ సాయి,సచివాలయం సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర ఫైనల్ మ్యాచ్ కబడ్డీలో కేశవరం జట్టు విజయం



కోట, జనవరి 17 (శ్రీచక్ర) :

కోట మండలంలో కోట మండల లెవెల్ కబడ్డీ పోటీల్లో గూడలి సచివాలయం వన్ మీద కేశవరం సచివాలయం జట్టు విజయం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కోట మండలంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పురుషుల విభాగంలో ఫైనల్ మ్యాచ్ లో కేశవరం సచివాలయం జట్టు కైవసం చేసుకోవడం జరిగిందని వ్యాయామ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట మండల విద్యాశాఖ అధికారి ధారా. మస్తానయ్య,గూడూరు నియోజకవర్గం ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వి. శివకుమార్,కోట మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఎస్.కె వలి అహ్మద్,వ్యాయామ ఉపాధ్యాయులు నంధానిభాష,కృష్ణ, కరిముల్లా,మాభాష,కార్తీక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, జనవరి 17 (శ్రీచక్ర) :

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ నెల తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్ లైన్ లక్కీడిప్ కోసం జనవరి 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు జనవరి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవాటికెట్లను జనవరి 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను జనవరి 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. శ్రీవారి వార్షిక వసంతోత్సవం ఏప్రిల్ 21 నుండి 23వ తేదీ వరకు జరుగనుంది. ఇందుకు సంబంధించిన సేవా టికెట్లను జనవరి 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జనవరి 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం, గదుల కోటాను జనవరి 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శన టోకెన్ల కోటాను జనవరి 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటాను జనవరి 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్ జనవరి 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జనవరి 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతికి చెందిన శ్రీవారి సేవ కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను, మధ్యాహ్నం 1 గంటలకు పరకామణి సేవ కోటాను విడుదల చేస్తారు. భక్తులు ఈ విషయాలను గమనించి https://ttdevasthanams.ap.gov.in వెబ్ సైట్ లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# అంబేడ్కర్ పేరుతో దోపిడీ

- విగ్రహం ఏర్పాటులో అవినీతి
- టిడిపి నేతల ఆరోపణలు

అమరావతి, జనవరి 17 (శ్రీచక్ర) :

అంబేద్కర్ పేరుని అడ్డంపెట్టుకుని వందల కోట్ల రూపాయల దోపిడీకి వైసీపీ ప్రభుత్వం తెరలేపిందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు ఆరోపించారు. మహాత్ముడి పేరుతో దోపిడీకి పాల్పడడం దారుణమన్నారు. బుధవారం నాడు శాఖమూరులో అంబేద్కర్ స్మృతి వనం ప్రాజెక్టును టీడీపీ దళిత నేతలు పరిశీలించారు. దొంగిలించిన విగ్రహాలు, స్మృతి వనం ప్రాజెక్టు నిర్వీర్య ప్రాంతాలను నేతలు పరిశీలించారు. హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటయితే.. ఏపీలో కూడా అలాంటి విగ్రహానికే రూ.400కోట్లు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వం రూ.137కోట్లతో 125అడుగుల అంబేద్కర్ విగ్రహన్ని నిర్మించ తలపెట్టిన స్మృతి వనాన్ని జగన్ ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. రూ.36కోట్లతో 26శాతం పనులు కూడా చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే పూర్తి అయిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన అంబేద్కర్ ప్రాజెక్టు కంటే.. వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ చిన్న విగ్రహం పేరుతో రూ.400కోట్ల దోపిడీకి పాల్పడుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వ కనుసన్నుల్లోనే అంబేద్కర్ విగ్రహాలు దోపిడీకి గురయ్యాయని నక్కా ఆనంద్ బాబు అన్నారు. రాజధాని అమరావతి లాగానే అంబేద్కర్ స్మృతి వనాన్ని కూడా జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. గత ఐదేళ్లలో దళితుల పట్ల జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు ఎప్పటికీ పోవని చెప్పారు. అంబేద్కర్, ఆయన రాసిన రాజ్యాంగం పైనా సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి, గౌరవం లేదని మండిపడ్డారు. ఒక వర్గం వారిని అణిచివేయడానికే అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో పెట్టారన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ భారీ విగ్రహాన్ని ఏపీలో ఎందుకు ఏర్పాటు చేయలేదని వర్ల రామయ్య ప్రశ్నించారు.

# కేంద్ర పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి

- కేంద్రమంత్రి దేవ్ సింగ్ చౌహాన్

కోట, జనవరి 17 (శ్రీచక్ర) :



కేంద్ర పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి దేవ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కోట మండలం జరుగుమల్లి గ్రామ పంచాయతీలో వికసత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి దేవ సింగ్ చౌహాన్ పరిటించారు. సీనియర్ నాయకులు ఉచ్చూరు రవీంద్ర రెడ్డి స్వగృహంలో భోజన అనంతరం బహిరంగ సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ భారతప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనలో భారతదేశం సుభిక్షంగా ఉందన్నారు. కేంద్రం ప్రభుత్వం పేదప్రజల సంక్షేమం కోసం 18 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని,అవి ప్రజలకు ఎంతో విధంగా ఉపయోగపడి,వార జీవన సరళికి తోడ్పాటు అందిస్తున్నా యన్నారు. నాయకులు అధికారులు సంక్షేమ పథకాలైన ఉజ్వల దీపంపథకం, మహిళా ఉపాధిపథకం, కిశోర సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్,పీఎం కిసాన్ యోజన,జల జీవన్ మిషన్,సుకన్య సమృద్ధి యోజన పథకాలు ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చూడాల్సిన బాధ్యత నాయకులు అధికారుల పైన ఉందన్నారు. అనంతరం కోటపట్టణం లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని బిజెపి నాయకులు సత్తెన అంబరీష్,విశ్వనాథం వాసు స్వగృహం చేరుకొని తేనీటి విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి దేవ్ సింగ్ చౌహాన్,మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బిజెపి పార్టీ తిరపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప,కోట మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం. రమేష్ బాబు,సీనియర్ నాయకులు దువ్వూరు. గిరిధర్ రెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు,గూడూరు బీజేపీ నాయకురాలు బిందురెడ్డి,గూడూరు నియోజకవర్గ పరిశీలకులు పాపా రెడ్డి. పురుషోత్తం రెడ్డి,ఉచ్చూరు రవీంద్ర రెడ్డి,యరటపల్లి మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో భవాని,ఎస్సై పి.నాగబాబు,అన్నీ శాఖ అధికారులు,బిజెపి నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు,పాల్గొన్నారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఘనంగా పార్వేట ఉత్సవం



తిరుపతి, జనవరి 17 (శ్రీచక్ర) :



తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా తీసుకుని వెళ్ళి ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పారువేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసారు. తిరిగి నగరవీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6.30 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, జేఈవో శ్రీ వీరబ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సిఏఓ శ్రీ బాలాజీ, విజివో శ్రీ బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి శాంతి, ఏఈవో శ్రీ ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీ మోహన్ రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ధనంజయ పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల వరుస షాక్

హైదరాబాద్, జనవరి 17 (శ్రీచక్ర) :

సైబర్ నేరగాళ్లు తెలంగాణలో ప్రముఖులు ఒక్కొక్కరికి షాకిస్తున్నారు. వారి సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ చేస్తున్నారు. మొన్న మంత్రి దామోదర రాజనర్సింహ ఫేస్ బుక్ హ్యాక్ కాగా, గవర్నర్ తమిళిసై ట్విట్టర్ అకౌంట్ ను హ్యాక్ చేశారు సైబర్ నేరగాళ్లు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ట్విట్టర్ అకౌంట్ హ్యాకింగ్ కు గురైంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ విషయంపై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కవిత తెలిపారు. సోషల్ మీడియా ఖాతాలను పూర్తి స్థాయిలో తిరిగి పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ తో పాటు ఇన్‌స్టాగ్రామ్ ఖతాలు కూడా హ్యాక్ కు గురయ్యాయి. సైబర్ నేరగాళ్లు మంగళవారం నాడు రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు వరుసగా పలు సార్లు హ్యాకింగ్ కు యత్నించారనని ఆమె తెలిపారు. అనుమానాస్పదంగా లాగిన్ అయ్యి సైబర్ నేరగాళ్లు ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో సంబంధం లేని ఒక వీడియోను పోస్టు చేశారు.

# గుంటలో మునిగి ఇంగిలాల. వెంకటరమణయ్య అనే వ్యక్తి మృతి



కోట, జనవరి 17 (శ్రీచక్ర) :


కోట మండలంలోని వావిళ్లదొరువు గ్రామంలోని దళితవాడకు చెందిన ఇంగిలాల. వెంకటరమణయ్య (55)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గుంటలో మునిగి బుధవారం మరణించడం జరిగిందని కోట ఎస్ ఐ పి.నాగబాబు తెలిపారు. అనంతరం ఇంగిలాల. వెంకటరమణయ్య మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబానికి అప్పగించడం జరిగిందని ఎస్ ఐ తెలిపారు. అదేవిధంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ నాగబాబు తెలిపారు.

# ఈశాన్య రాష్ట్రాలపై గొప్పలు

ఇంఫాల్, జనవరి 17 (శ్రీచక్ర) :

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై గొప్పలు చెప్పే ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్రాంతాన్ని పూర్తిగా అలక్ష్యం చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. నాగాలాండ్ లో మౌలిక వసతుల లేమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాహుల్ నాగాలాండ్‌లో బుధవారం జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. నాగాలాండ్ ప్రజలు రోజూ తిరిగే ఈ గతుకుల రోడ్లపై మీరు నడిచే సాహసం చేస్తారా అని మోదీని ఆయన నిలదీశారు. ఇది నాగాలాండ్ ప్రజలను మోసం చేయడమేనని, ఈ గుంతల రోడ్లతో నాగాలాండ్ యువతకు మీరు మెరుగైన భవిష్యత్‌ను ఎలా తీసుకురాగలరని ప్రశ్నించారు. నాగా ప్రజలు రహదారులు సవ్యంగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ సమస్యలు, మౌలిక వసతుల లేమి ఈ ప్రాంతాన్ని వెంటాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగా ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు లభించడం లేదని అన్నారు. అభివృద్ధిలో నాగాలాండ్, మణిపూర్, అస్సాం సహా ఈశాన్య ప్రాంత ప్రజలు భాగస్వామ్యం కాలేకపోతున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు.

# దూసుకుపోతున్న గుంటూరు కారం




టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్‌బాబు కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం గుంటూరు కారం.ఈ సినిమాను తొలి రోజు నుంచి నెగెటివ్ టాక్, ట్రోల్స్ చుట్టుముడుతున్నా..కలెక్షన్ల విషయంలో మాత్రం తగ్గేదేలే అంటోంది. టాక్ మాటెలా ఉన్నా సూపర్ స్టార్ మ్యానరిజానికి అభిమానులు మరోసారి ఫిదా అయిపోతున్నారు. ఇప్పటికే థియేటర్లలో దగ్గర డ్యాన్సులు, కేకలతో హోరెత్తిస్తోన్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గుంటూరు కారం నెగెటివ్ టాక్‌తో సంబంధం లేకుండా అత్యంత అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది.గుంటూరు కారం రూ.100 కోట్ల షేర్ రాబట్టింది. భరత్ అనే నేను, మహర్షి, సరిలేరు నీకెవ్వరు, సర్కారు వారి పాట సినిమాల తర్వాత ఈ రికార్డు సాధించిన చిత్రంగా గుంటూరు కారం నిలిచింది. దీంతో బ్యాక్ టు బ్యాక్ ఐదు సినిమాలకు రూ.100 కోట్ల షేర్ సాధించిన వన్ అండ్ ఓన్లీ టాలీవుడ్ హీరోగా రికార్డుల్లోకెక్కాడు ప్రిన్స్. గుంటూరు కారం శాటిలైట్ రైట్స్‌ను జెమినీ టీవీ దక్కించుకోగా.. పాపులర్ ఓటీటీ ఎ÷–లాట్‌ఫాం నెట్‌ప్లిక్స్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను దక్కించుకుంది. గుంటూరు కారం మేకింగ్ వీడియో, మేకింగ్ స్టిల్స్ నెట్టింట హల్ చల్ చేస్తూ.. సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సెట్స్‌లో మీనాక్షి చౌదరి, శ్రీలీల, మహేశ్ బాబు, త్రివిక్రమ్ అండ్ ప్రొడ్యూసర్స్ టీం సరదా క్షణాలకు సంబంధించిన ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో ఎస్ థమన్ ఊరమాస్ కంపోజిషన్‌లో శ్రీలీల, మహేశ్ బాబు కాంబోలో వచ్చే హై ఓల్టేజ్ స్పైసీ హాట్ మాస్ కుర్చీని మడతపెట్టి సాంగ్ థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి.

# ఓజిలో పాటపాడనున్న పవన్ కళ్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు ఓ గుడ్ న్యూస్. ప్రజెంట్ పాలిటిక్స్ మీద ఆయన ఫుల్ కాన్సంట్రేట్ చేశారు. అందువల్ల, షూటింగులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆయన షూటింగ్ చేయడం లేదు గానీ... ఆయనతో సినిమాలు చేస్తున్న దర్శక నిర్మాతలు సినిమా మీద వర్క్ చేయడం ఆపలేదు. పవన్ నటిస్తున్న క్రేజీ సినిమాల్లో 'ఓజీ' ఒకటి. దీని గురించి సంగీత దర్శకుడు తమన్ ఓ అప్డేట్ ఇచ్చారు. వన్ కళ్యాణ్ స్టార్ హీరో. ఆయన హీరో మాత్రమే కాదు... ఆయనలో ఓ సింగర్ కూడా ఉన్నారు. ఆయనతో పాట పాడించాలని తమన్ ప్లాన్ చేస్తున్నారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ చేస్తున్న సినిమా 'ఓజీ'. ఆ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఓజీ' స్క్రిప్ట్ లో పవన్ గారి చేత పాడించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. మేం ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని చెప్పారు. పవన్ కళ్యాణ్ గనుక ఓకే అంటే... 'ఓజీ'లో ఆయన పాటను మనం వినొచ్చు. ఈ సినిమా కోసం ఆల్రెడీ తమన్ కొన్ని ట్యూన్స్ ఇచ్చారు. అందులో ఓ పాటను పుణెలో షూటింగ్ కూడా చేశారు. 'ఓజీ'లో పవన్ సరసన యంగ్ హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్ నటిస్తున్నారు. వాళ్లిద్దరిపై ఆ పాట తీశారు. ఇంతకు ముందు 'తమ్ముడు' సినిమాలో 'ఏం పిల్ల మాటాడవా' పాటతో మొదలు పెడితే... అందులోనే 'తాటి చెట్టు' నుంచి 'ఖుషి' సినిమాలో 'బై బయ్యే బంగారు రవణమ్మ...', 'జానీ' సినిమాలో 'నువ్వు సారా తాగకు', 'రావోయి మా ఇంటికి', 'పంజా'లో 'పాపారాయుడు', 'అత్తారింటికి దారేది'లో 'కాటమరాయుడు', 'అజ్ఞాతవాసి' సినిమాలో 'కొడకా కోటేశ్వర్ రావు' పాటలు పాడారు.




# కలెక్షన్లలో నాసామిరంగా దూకుడు

కింగ్ నాగార్జున హీరోగా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వంలో తెరకెక్కి.. ఈ సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన 'నా సామిరంగ' చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే కలెక్షన్లు పండిస్తోంది. బ్రేకీవెన్‌కి దగ్గరగా వచ్చేసినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాని నిర్మించారు. నాగార్జునకు జోడిగా ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో అల్లరి నరేష్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సర్ థిల్లాన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుని.. విడుదలైన లిమిటెడ్ థియేటర్లలోనే భారీ కలెక్షన్స్ రాబడుతూ.. సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం బ్రేకీవెన్ కి దగ్గరగా వచ్చినట్లుగా తెలుపుతూ.. మూడు రోజులకు ఎంత కలెక్ట్ చేసిందో అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రకారం మూడో రోజు కూడా కిష్టయ్య కుమ్మేశాడు అనేలా కలెక్షన్స్ రాబట్టాడు. మొదటి రోజు 'నా సామిరంగ' సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 8.6 కోట్ల కలెక్షన్స్ రాబడితే.. రెండు రోజు రూ. 9.2 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబట్టి మొత్తంగా రెండు రోజులకు కలిపి రూ. 17.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇక మూడో రోజు ఈ సినిమా రూ. 7.0 కోట్ల కలెక్షన్స్‌ను రాబట్టింది. మూడు రోజులకుగానూ ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 24.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా.. విడుదల చేసిన పోస్టర్‌లో మేకర్స్ తెలియజేశారు. 'నా సామిరంగ'కు లిమిటెడ్ థియేటర్లే లభించడంతో ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా తక్కువగానే జరిగింది. ఈ మూవీ రూ. 19 ప్లస్ కోట్ల షేర్ కలెక్షన్స్‌ని రాబడితే బ్రేకీవెన్ అయినట్లే. ప్రస్తుతం 3రోజులకి ఈ సినిమా రూ. 13 కోట్ల వరకు షేర్ రాబట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు పండగ ఈ సినిమాకు అడ్వాంటేజ్ అయింది. బుధవారం నుండి ఈ సినిమా రాబట్టే కలెక్షన్లే అత్యంత కీలకం కానున్నాయి. అయితే, పాజిటివ్ టాక్‌తో పాటు.. మరో వారం, పది రోజుల వరకు ఇతర సినిమాలేవీ లేవు కాబట్టి.. కచ్చితంగా 'నా సామిరంగ' బ్రేకీవెన్ అయ్యి, లాభాల బాట పట్టే అవకాశం ఉంది.

# హనుమాన్‌ను మెచ్చుకున్న బాలయ్య

ప్రశాంత్ వర్మ ఏ ముహుర్తానా పట్టుబట్టి హనుమాన్ చిత్రాన్ని జనవరి 12న విడుదల చేశాడో గానీ సినిమా విడుదలైన మరుక్షణం నుంచి ప్రపంచవ్యాప్తంగా అప్రతిహతంగా దూసుకెళుతూ మరోసారి తెలుగోడి సత్తాను వెలుగెత్తి చాటేలా చేస్తుంది. తాజాగా నటుడు బాలకృష్ణ చిత్రాన్ని వీక్షించి అభినందించారు. అద్భుతంగా ఉందంటూ చిత్రబృందాన్ని ఆకాశానికి ఎత్తారు. సినిమాను చూసిన వారు ఆకాశానికెత్తెస్తూ.. నటుల యాక్టింగ్‌కు, దర్శకుని ప్రతిభకు చేతులెత్తి నమస్కరిస్తున్నారు. ఈ చిత్రాన్ని చూసి బాలీవుడ్ నేర్చుకోవాల్సింది చాలా ఉందంటున్నారు. టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా నటించిన తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ హనుమాన్ తొలి తెలుగు సూపర్ హీరో సిరీస్‌గా ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ కలెక్షన్లతో దూసుకెళ్తోంది. 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన హనుమాన్ నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. కాగా హనుమాన్ స్పెషల్ స్క్రీనింగ్‌కు బాలకృష్ణ హాజరయ్యారు. అద్భుతమైన సినిమా తెరకెక్కించిన ప్రశాంత్ వర్మపై ప్రశంసలు కురిపించాడు బాలకృష్ణ. ఈ సందర్భంగా బాలకృష్ణ, ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్ రెడ్డి దిగిన ఫొటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. గౌరా హరి–అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ సంయుక్తంగా అందించిన మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. హాలీవుడ్ స్థాయిలో డిజైన్ చేసిన విజువల్స్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. టాలీవుడ్ తో పాటుగా బాలీవుడ్ లో, ఓవర్సీస్ లలో బాహుబలి, బీట్ చేస్తూ రికార్డు కలెక్షన్లు కొల్లగొట్టి ట్రేడ్ పండితులను సైతం ఆశ్చర్య పరుస్తుంది. రిలీజైన నాలుగు రోజుల్లో 100 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి ఔరా అనిపించింది. తాజాగా ఈ సినిమాను కన్నడ స్టార్ హీరోలు శివరాజ్ కూమార్, రిషబ్ షెట్టి, ధనుంజయ.. తమిళ ఇండస్ట్రీ నుంచి రాధిక, శరత్ కుమార్.. బాలీవుడ్ నుంచి మాధవన్, వివేక్ అగ్నిహోత్రి.. మళయాళ పరిశ్రమ నుంచి ఉన్ని ముకుందన్.. టాలీవుడ్ నుంచి బాలకృష్ణ, రవితేజ, రామ్ పోతినేని, మంచు విష్ణు, నారా రోహిత్, గోపీచంద్,ఆర్జీవీ, సాయిధరమ్ తేజ్, నాని, వరుణ్ తేజ్, రాఘవేంద్రరావు వంటి హీరోలు, దర్శకులు చిత్రయూనిట్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. బాలకృష్ణ ప్రత్యేకంగా షో వేయించుకుని మరి సినిమా తిలకించి ప్రశాంత్ వర్మను పొగడ్తల్లో ముంచెత్తారు. ఇక విదేశాల్లో సైతం ఈ సినిమా రికార్డు కలెక్షన్లను రాబడుతున్నది. ఉత్తర అమెరికాలో 3 మిలియన్ల డాలర్ల వసూళ్లను దాటింది. అక్కడ మొదటి వారాంతంలో ఆర్ఆర్ఆర్, బాహుబలి, సలార్ రికార్డులను దాటేయడం విశేషం. అమెరికాలో లాంగ్న్‌రన్‌లో ఈ చిత్రం 5 మిలియన్ డాలర్ల వసూళ్లను దాటొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం అనూహ్య వసూళ్లతో సంక్రాంతి విజేతగా నిలిచిందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతీయ తొలి ఒరిజినల్ సూపర్ హీరో ఫిల్మ్‌గా 'హనుమాన్'కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. రాబోవు రోజుల్లో ఈ సినిమాకు మరిన్ని థియేటర్‌లు అందుబాటులోకి రానున్నాయని సమాచారం.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**